ఆదివారం
ప్రజాశక్తి
జూలై 25, 2004



యానిమేషన్ .....

హ్యాపీ బర్త్‌డే

(25-7-2004 నుండి 31-7-2004 వరకు)

వీర వెంకట దుర్గాప్రసాద్
3సం॥, 25.7.2001
వీరమణి-వీరనాగేశ్వరరావు
రాజమండ్రి-తూ॥గో॥

కె. స్పందన
4సం॥, 25.7.2000
అనూరాధ-వెంకటేష్
నెల్లూరు

శ్రావణి
4సం॥, 25.7.2000
జయ-యుగంధర్
ముదిగొండ-ఖమ్మం

ప్రవీణ్‌కుమార్
జులై-26
శారద-హేమసుందరరావు
కోష్ట-శ్రీకాకుళం

డి. స్ఫూర్తి
3సం॥, 25.7.2003
సుజాత-మల్లేష్
రణదివేనగర్-ఆదిలాబాద్

శరత్మల్లిక
6సం॥, 27.7.1998
దేవి-గంగాధర్
ఉక్కునగరం-విశాఖ

విజేత
8సం॥, 27.7.1996
లక్ష్మి-సత్యనారాయణ
ఉక్కునగరం-విశాఖ

రవిచంద్ర
1సం॥, 27.7.2003
సునీత-వెంకటస్వామి
వెంకట్రావు పేట-ఆదిలాబాద్

సింధుప్రియ
2సం॥, 28.7.2002
విజయలక్ష్మి-చందు
స్టేషన్ బేతంపూడి-ఖమ్మం

సాహితీరెడ్డి
2సం॥, 28.7.2002
నాగమల్లేశ్వరి-వెంకటరెడ్డి
పెద్దారవీడు-ప్రకాశం

చిత్రాంజని
10సం॥, 29.7.1994
రామలక్ష్మి-రమణ
కాకినాడ-తూ॥గో॥

డి.దివ్యశ్రీ
2సం॥, 30.7.2002
రోజారాణి-రమేష్‌బాబు
తెనాలి-గుంటూరు

చిన్నూ
1సం॥, 31.7.2003
ఉమామహేశ్వరి-నర్సింహాచారి
భిక్కనూరు-నిజామాబాద్

లతీఫ్ అహ్మద్
సఫర-సుభాన్ ఆలీ
విశాఖపట్నం

గమనిక: పదేళ్ళ వరకు వయస్సు గల చిన్నారులందరికీ ఈ 'హ్యాపీ బర్త్‌డే' శీర్షిక కింద ఉచితంగా శుభాకాంక్షలు తెలియచేస్తాం. దీనికి మీరు చేయవలసిందల్లా మీ చిన్నారి పుట్టిన రోజుకు 20 రోజులు ముందుగా ఓ కలర్ ఫొటో జత చేసి మీ చిన్నారి పేరు, పుట్టినతేదీ, తల్లిదండ్రుల పేర్లు, చిరునామా వంటి వివరాలు పంపడమే. ప్రజాశక్తి శుభాకాంక్షలతో మీ చిన్నారి పుట్టిన రోజును ఆనందంగా జరుపుకోండి.

పంపవలసిన చిరునామా:

హ్యాపీబర్త్‌డే, ప్రజాశక్తి ఆదివారం అనుబంధం, 1-1-298/4,
స్ట్రీట్ నెం. 1, అశోక్‌నగర్, హైదరాబాద్-20.

లీడర్స్ మెయిల్

టు
ది ఎడిటర్, ప్రజాశక్తి
ఆదివారం అనుబంధం



మేఘమథనం హైలెట్

జులై 11 ఆదివారం అనుబంధంలో కవర్‌స్టోరీ మేఘమథనం చాలా బాగుంది. మేఘమథనంలో ఇమిడి వున్న శాస్త్రీయ పరిజ్ఞానాన్ని చక్కగా వివరించి విజ్ఞానం అందించారు. మూఢనమ్మకాలతో ఉండే సామాన్య ప్రజలకు అర్థమయ్యే రీతిలో చక్కని సమాచారాన్ని అందించారు. వివిధ దేశాలలో మేఘమథనం ప్రయత్నాలు, వాటి ఫలితాలు, మన రాష్ట్రంలోని మేఘమథన వివరాలు శాస్త్రీయ కోణంలో చక్కగా వివరించారు. కర్నాటక, మహారాష్ట్ర వంటి ప్రాంతాల్లో మేఘాలను ఉప్పు పొడితో కృత్రిమ వర్షాలు కురిపించి విజయం సాధించారని తెలిసింది. మన రాష్ట్రంలో కూడా కృత్రిమ వర్షాలను కురిపించడానికి ప్రయత్నాలు చేయడం అభినందనీయం. అయితే మేఘమథనం ఖర్చుతో కూడిన వ్యవహారమని, ఈ ప్రక్రియకు ప్రత్యేక విమానాలు అవసరమని తెలిసింది. కొన్ని ప్రాంతాల్లో ఆశించిన ఫలితాలు ఇవ్వలేదని చదివాము. పూర్తి అవగాహనతో సాధ్యాసాధ్యాలు పరిశీలించి ప్రజాధనం దుర్వినియోగం కాకుండా నిర్వహించి కృత్రిమ వర్షాలతో కరువు కోరలో చిక్కుకున్న ఈ రాష్ట్ర ప్రజలను కొంత మేరైనా ప్రభుత్వం ఆదుకుంటుందని ఆశిద్దాం.

– పి.ప్రేమ్‌కుమార్,
వెల్దండ, మహబూబ్‌నగర్ జిల్లా

– ఎం.డి.ముస్తఖీమ్,
కొల్లాపూర్, మహబూబ్‌నగర్ జిల్లా

కవర్‌స్టోరీ వివరంగా ఉంది

మేఘమథనం కవర్ స్టోరీ చాలా విపులంగా ఉంది. ఆరోగ్యం పేజీలో వ్యాధి నిర్ధారణలో రోగులకు వరం 'రేడియో డయాగ్నొసిస్' ద్వారా సి.టి.స్కాన్, ఎం.ఆర్.ఐ., గామా కిరణాలు, రేడియో ఐసోటోప్‌ల ద్వారా ఏ రీతిన వ్యాధినిర్ధారణ చేస్తారో తెలిసింది. కళాసాహితిలో 'మ్యాజిక్ మనోహర్' మ్యాజిక్ తీరు గురించి తెలుసుకోవడం. మొత్తానికి సంచికలోని అన్ని విషయాలు ఆకట్టుకున్నాయి.

– కామిడి సతీష్‌రెడ్డి,
జడలపేట, వరంగల్ జిల్లా

అభినందనలు

రియల్ స్టోరీ వీరతెలంగాణా తొలి తెలుగు వీరుడు దొడ్డికొమరయ్య జీవిత కథను తెలియజేసినందుకు అభినందనలు. మ్యాజిక్ స్టిక్ మనోహర్ గురించి చెప్పింది కూడా బాగుంది. మధుర మీనాక్షి ఆలయం గురించి చరిత్ర బాగుంది. కవర్ స్టోరీ ఆద్యంతం ఆసక్తికరంగా ఉంది.

– బాల శ్రీనివాస్, సామర్లకోట, తూ.గో.జిల్లా

వర్తమానానికి అద్దం జీవనశైలి

జీవనశైలి సామాజిక ఆమోదం, వర్తమాన సామాజిక పరిస్థితులకు అద్దం పట్టింది. అందులో సూచించినట్లు సమాజంలో తక్షణం మార్పులు రావాలి. సామాజిక చైతన్యం ద్వారా సమాజంలో నెలకొన్న వరకట్నం, లంచగొండితనం వంటి దురాచారాలను రూపుమాపగలం. అందుకు మేధావులు, సాంఘిక సేవా కార్యకర్తలు నిరంతరం

ప్రజల మధ్య ప్రచారం సాగించాలి. ఈ అనర్థాలన్నిటికీ మూలం రాజకీయాల్లో ప్రక్షాళన జరగాలి. కవర్ స్టోరీ విజ్ఞానదాయకంగా ఉంది.

–జి.వి.నరసింహరాజు,
రామకృష్ణాపురం, సికింద్రాబాద్.

ఇంతిసంగతులు సరదాగా ఉంది

ఈ వారం ఇంతి సంగతులు సరదాగా ఉంది. 'మ్యాజిక్ మ్యాజిక్'లో బొమ్మలతో ఆకృతులు కాకుండా చిన్న పిల్లలు చేయగలిగే, వారికి లభ్యమయ్యే సామగ్రితో కొన్ని ట్రిక్స్ తెలియపరిస్తే బాగుండేది. బాలల పేజీలు ఆకట్టుకుంటున్నాయి. కవితలు చక్కని సందేశాన్ని అందించాయి. కవర్ స్టోరీ బాగుంది.

– జి.ఎన్.ప్రసాదరావు,
పాలకొల్లు, ప.గో.జిల్లా

త్యాగపురుషుల గాథలు ప్రచురించండి

కవర్ స్టోరీ 'మేఘమథనం' చాలా విపులంగా వుంది. జీవైనశైలిలో ప్రచురించిన 'సామాజిక ఆమోదం' ఈ వ్యవస్థలో వున్న ఆలోచనలకు దర్పణంలాంటిది. 'రియల్ స్టోరీ' బానిస సమాజానికి బలైన తొలి తెలుగు బిడ్డ 'దొడ్డికొమరయ్య'గారికి విప్లవ జోహార్లు. ఆదివారం అనుబంధంలో ఇలాంటి త్యాగపురుషుల గాథలు, విలువలతో కూడుకున్న కథలు, సామాజిక స్పృహ కలిగిన వ్యాసాలు ప్రచురిస్తున్నందుకు అభినందనలు.

– కొమ్మినేని ఆదినారాయణరావు,
తల్లాడ, ఖమ్మం జిల్లా

మనలో మాట

ఆత్మాభిమానం

గయ్యాళి అత్త కొట్టినందుక్కాదుగానీ -

తోటికోడలు చూసినందుకొచ్చిందట దుఃఖం!

నిత్యజీవితంలో అనేక చోట్ల ఈ ఉదంతం తరచూ చోటు చేసుకుంటూనే వుంటుంది. గయ్యాలీ అత్తగారు అనగానే - సినిమాల్లో సూర్యాకాంతం గుర్తుకొస్తుంది!

అంచేత -

అత్తగారు గుట్టుగా ఎన్ని వాతలు వడ్డిస్తున్నా కోడలు పిల్లకూడా - ఆ వాతలను కళాత్మకంగానే స్వీకరించి తట్టుకుంటుంది! సంసారం అల్లరి కాకూడదనే వాటిని సహిస్తుంది

అయితే -

ఈ దిక్కుమాలిన దృశ్యం మూడోమనిషి చూసినప్పుడు మాత్రం కథ అడ్డం తిరుగుతుంది. కోడలు పిల్ల రియాక్టవుతుంది!

అంచేత -

తాడోపేడో తేల్చుకోవాలనే పవిత్రమైన కోరికతో పక్కనే వున్న రోకలి బండని చేతుల్లోకి తీసుకుంటుంది. కళ్ళెర్ర చేస్తుంది. కాళీ రూపం దాల్చుతుంది. అత్తా అని గాండ్రిస్తుంది. నీ నెత్తురు తాగుతానని చిందులు తొక్కుతుంది!

ఇంచుమించు -

ఆఫీసుల్లో కూడా ఇదే భాగోతం నడుస్తూ వుంటుంది!

అక్కడ -

అధికారే గయ్యాళీ అత్తగారు! కిందవాళ్ళు కోడళ్ళు!

కింది వాళ్ళని చివాట్లు పెట్టాలనుకున్నప్పుడు - సదరు అధికారి పరిసరాలను తప్పనిసరిగా గమనించాలి. అవి ఇరుపక్షాలకు అనుకూలంగా వున్నప్పుడే వాతలు పెట్టాలి!

ఆ వాతల్ని కిందివాడు కళాత్మకంగానే స్వీకరిస్తాడు!

పరిసరాలను గమనించకుండా పై వాడు నోరు పారేసుకుంటే ఆ వైనం ఇతరులు గమనిస్తున్నారని చివాట్లు తింటున్న మనిషికి తెలిసిపోతే మాత్రం - ఇంతేసంగతులు!

కుర్చీ గాల్లో ఎగురుతుంది! గురి తప్పితే అధికారి తల పగుల్తుంది! ◆

ఈ సంచికలో . . .

ఔరా!	. . . 3
కార్టూన్ కదంబం...	. . . 4
కవర్ స్టోరీ	. . . 6
జీవనశైలి	. . . 10
బాలల కథ	. . . 11
బాలనేస్తాలు	. . . 12
ఇంతిసంగతులు	. . . 16
కచేరి	. . . 17
ఆరోగ్యం	. . . 18
పుస్తక పరిచయం	. . . 20
న్యాయసలహాలు	. . . 24

ఇంకా...

ఆడపిల్ల

కథ ... 9, 19

లైటుహౌస్

రియల్‌స్టోరీ... 14, 15

దక్షిణ కాశి రామేశ్వరం

టూరిస్ట్ గైడ్ . . . 21

రంగస్థలంమీదే ఇన్‌వాల్వ్‌మెంట్ ఎక్కువ

కళాసాహితి . . . 22, 23

15 వేలకే కారు



లక్ష రూపాయలకే కారు ఇస్తాం, త్వరలోనే మార్కెట్‌లో ప్రవేశపెడతాం అంటూ ఒక ప్రముఖ కంపెనీ కొన్నాళ్ళుగా దేశంలోని దిగువ మధ్యతరగతి ప్రజలను ఊరిస్తోంది. ఇందుకోసం ఐఐటిల్లో చదివిన ఇంజనీర్లు అహోరాత్రులు కృషి చేస్తున్నారు. అయితే గుజరాత్‌లో పెద్దగా చదువురాని మోటార్ వెల్డింగ్ పనులు చేసుకునే పాతికేళ్ళ యువకుడు ఇద్దరు కూర్చుని వెళ్ళగలిగే కారును పదిహేను వేలకే తయారు చేసి చూపించాడు. గులాబ్ పార్మర్ అనే ఈ యువకుడు ఏడాదిన్నర పాటు కష్టపడి రామ్‌ప్యారీ అనే పేరుతో ఈ బుల్లికారును రూపొందించాడు. నాలుగు అడుగుల వెడల్పు, ఆరడుగుల పొడవు ఉన్న రామ్‌ప్యారీ కారు చూడటానికి ఎంతో ముచ్చటగా ఉన్నదని, స్కూటర్ ధర కంటే కూడా తక్కువకే తయారు చేయడం మంచి విషయమని అందరూ మెచ్చుకుంటున్నారట! అందుబాటులో ఉన్న వివిధ రకాల కార్లు, మోటార్ సైకిళ్లకు చెందిన విడిభాగాలతోనే గులాబ్ ఈ కారును రూపొందించాడు. అంతా కలిపి పదిహేను వేల రూపాయల ఖర్చయిందంటున్నాడు. లక్ష రూపాయలకే కారు ఇస్తామని చెబుతూ పరిశోధనల కోసం కోట్లు ఖర్చు పెట్టే పెద్ద కార్ల కంపెనీ రామ్‌ప్యారీని చూస్తే బాగుంటుందేమో!?

లిఫ్ట్ కంటే ఇదే బెటర్ కదా!?

పెద్ద పెద్ద భవనాల్లో పైకి ఎక్కడానికి లిఫ్టులు ఏర్పాటు చేస్తారు గానీ ఎవరూ మెట్ల మీదుగా ఎక్కి కష్టపడటానికి ఇష్టపడరు. ఇక విమానాశ్రయాల్లో, రైల్వే స్టేషన్లలోనూ నిలబడగానే మన ప్రమేయం లేకుండా రయ్యిన వెళ్ళిపోయే ఎస్కలేటర్లను ఎక్కువగా ఏర్పాటు చేస్తున్నారు. దీనివల్ల వంటికి ఏమాత్రం శ్రమ ఉండదు. అందుకే ఢిల్లీలోని మెట్రో రైల్వే స్టేషన్లలో ఎవరూ లిఫ్టులు ఎక్కడం లేదట! అందరూ ఎస్కలేటర్లపై వెళ్ళడానికి ఆసక్తి చూపిస్తున్నారు. ఇంతవరకు ఫర్వాలేదు. కాని చిక్కంతా వాటితోనే వచ్చింది. ఒళ్ళు కదలకుండా పైకి కిందికి తిరిగే సౌలభ్యం ఉండటంతో చాలామంది తుంటరి యువకులు ఏమీ పనిలేకుండా అదేపనిగా ఎస్కలేటర్లపై తిరుగుతున్నారట! దీనివల్ల ప్రయాణీకులు ఇబ్బంది పడుతున్నారు. ఊసుపోక తిరిగేవాళ్ళు కూడా రైలు రాకకోసం ఎదురు చూసేవాళ్ళు, రైలు దిగేవాళ్ళే కావడంతో వారిని ఎలా అడ్డుకోవాలో తెలియక రైల్వే అధికారులు తలలు బాదుకుంటున్నారట! మరోపక్క స్టేషన్‌లోని లిఫ్టులు మాత్రం వాడేవారు లేక తుప్పుపడుతున్నాయట!?



ఈ చిలుకలు అంతరించిపోతున్నాయి!

న్యూజిలాండ్ జాతికి చెందిన ఈ రాత్రి చిలుకలు అంతరించిపోతున్నాయని పర్యావరణ, పక్షిమిత్రులు ఆందోళన చెందుతున్నారు. కేవలం రాత్రివేళల్లోనే సంచరించే కకాపు జాతి చిలుకలు న్యూజిలాండ్‌లో మాత్రమే కనిపిస్తాయి. ప్రస్తుతం పక్షి సంరక్షకుల సంరక్షణలో మాత్రమే 56 చిలుకలు ఈ భూమిమీద ఉన్నాయి. ఎటువంటి జబ్బులు లేకపోతే వందేళ్ళకు పైగా జీవించే చిలుకలు పర్యావరణ కారణాల వల్ల అంతరించిపోతుండటంతో ఎట్టకేలకు 56 పక్షులను సంరక్షించి కాపాడుతున్నారు. అయితే ఇటీవల అంతుపట్టని వైరస్ కారణంగా మూడు చిలుకలు ఒక్కసారే చనిపోయాయట. దీంతో మిగిలినవాటిని ఇంటెన్సివ్‌కేర్‌లో చేర్పించి వైరస్ సోకకుండా చూస్తున్నారట. వాటికి కూడా వైరస్ సోకితే ఇక ఈ రాత్రి చిలుకలు మనుష్యులకు కనిపించవంటున్నారు!?

కార్టూన్ కదంబం


అభివృద్ధి వైపు
దూసుకుపోదాం...నడువు... క్విక్..!
రాష్ట్ర ఆర్థిక వ్యవస్థ


ఎయిడ్స్
వెరీగుడ్...
వెరీగుడ్...
ఎయిడ్స్ పై యుద్ధం


టేలెంట్ ఉండగానే సరిపోదు మోడీలాగా
పని చేస్తే... మర్యాదకు మర్యాద...పదవికి పదవి
ఉంటుంది...!
కతియార్
కతియార్‌కు
ఉద్వాసన

నేర్పుతాం ఇంగ్లీషు ఈజీగా, మాట్లాడండి ఇక దాన్ని హాయిగా!

ఎలా అంటారా? ఎంతో లేదండీ కేవలం 750 ఇంగ్లీషు పదాలు తెలుసుకుంటే చాలు. మీరు రోజూ మాట్లాడే సంభాషణలను అనర్గళంగా ఇంగ్లీషులో మాట్లాడవచ్చు.

ఇప్పటికే ఇందులోని కొన్ని పదాలను మీకు తెలియకుండానే మీరు ఉపయోగిస్తున్నారు.

ఇక సందర్భానుసారంగా ఏ ఏ పదాలను ఎలా ఎక్కడ అర్థమయ్యేలా ఉపయోగించాలో నేర్పించటమే మా వంతు. ఇది తెలుసుకుంటే చాలు. మీరు కూడా హాయిగా ఇంగ్లీషులో మాట్లాడగలుగుతారు.

దీనికనుగుణంగా ఈ శిక్షణను గత **23** సంవత్సరాలుగా మేము అందిస్తున్నాం.

మరో విశేషమేమిటంటే ఈ శిక్షణ విద్యార్థులు, ఉద్యోగస్తులు, వ్యాపారస్తులు మరియు గృహిణులు ఇలా అన్ని రంగాల వారికి ఎంతో ఉపయోగకరం.

శిక్షణ పాఠాలను మీ తీరిక వేళలో శ్రద్ధగా ప్రతిరోజు ఒక అరగంట మాత్రం చదివి ప్రాక్టీసు చేస్తే చాలు. 60 రోజులలో మీరు కూడా సరళంగా ఇంగ్లీషు మాట్లాడటం ప్రారంభిస్తారు.

ఈ శిక్షణ ద్వారా ఇప్పటికే **16** లక్షలకు పైబడినవారు ఇంగ్లీషులో సరళంగా మాట్లాడే అవకాశం పొందగలిగారు. ఇక ఇప్పుడు ఈ అవకాశం మీకే !

దీనికి మీరు చేయవలసిందల్లా ఒక్కటే. క్రిందవున్న కూపను పూర్తి చేసి పంపండి. శిక్షణకు కావలసిన పాఠాల ప్యాకేజ్ **V.P.P.** ద్వారా మీ ఇంటిని వెతుక్కుంటూ వస్తుంది.

మరచిపోకండి. కూపను వెంటనే పంపండి.

ఇదిగో కూపన్

Yes! నేను ఇంగ్లీషులో సరళంగా మాట్లాడాలనుకుంటున్నాను. నాకు కోర్సు పాఠాలను **V.P.P.** ద్వారా పంపండి. పోస్టుమేన్‌కి **రూ. 575/-** చెల్లించి పాఠాలను తీసుకుంటాను.

పేరు: ....

వయసు: .... ఆడ ☐ మగ ☐

చిరునామా: ....

....

.... పిన్‌కోడ్ ....

VIVEKANANDA INSTITUTE

9, Madley Road, T.Nagar, Chennai-600017.

PS-1

VIVEKANANDA INSTITUTE

INDIA'S No.1 ENGLISH TRAINING INSTITUTE

08/TEL/04/NAGA

వివేకానంద ఇన్‌స్టిట్యూట్‌యొక్క ప్రత్యక్ష శిక్షణ కేంద్రాలు: HYDERABAD: (S.R.NAGAR ☎ 23714330. DILSUKHNAGAR ☎ 24044352. VANASTHALIPURAM ☎ 24122464. MEHDIPATNAM ☎ 55755888. A.S.RAO NAGAR ☎ 55497992. NARAYANAGUDA ☎ 55155441). RAJAMUNDRY ☎ 2422003. KAKINADA ☎ 2386638. VISAKHAPATNAM ☎ 2738892. VIJAYAWADA ☎ 5530053. GUNTUR ☎ 2238541. NELLORE ☎ 2327702. THIRUPATI ☎ 2252878. CUDDAPAH ☎ 224445. MIRYALGUDA ☎ 230130. ANANTAPUR ☎ 241029. KURNOOL ☎ 248099. NIZAMABAD ☎ 235767. PRODDATUR ☎ 250550.

యానిమేషన్.. ఈ పేరు ఇటీవల తరచుగా వినిపిస్తోంది. వాల్ట్ డిస్నీ కారణంగానే కార్టూన్ లేదా యానిమేషన్ సినిమాలకు ప్రపంచవ్యాప్తంగా ప్రాచుర్యం వచ్చింది. వీటిపట్ల పిల్లలకున్న క్రేజ్‌ను దృష్టిలో పెట్టుకునే ఇప్పుడు తెలుగు టీవీ ఛానల్స్ కూడా అనేక కార్టూన్ మూవీలను ప్రసారం చేస్తున్నాయి. మోగ్లీ, పంచతంత్రం, సాహసబాలుడు, టామ్ అండ్ జెర్రీ వంటివేకాక కార్టూన్ నెట్‌వర్క్ ఛానల్‌లో 24గంటలూ రకరకాల కార్టూన్ మూవీలు ప్రసారం అవుతూనే వున్నాయి. టీవీ అడ్వర్టయిజ్‌మెంట్లలో కూడా కంప్యూటర్‌ను ఉపయోగించి ఊహాజనితమైన దాన్ని కూడా నిజమని భ్రమించే విధంగా రకరకాల టెక్నిక్స్‌ను ఉపయోగిస్తున్నారు. భారతీయ భాషాచిత్రాల్లో అయితే ఒకటీ రెండు సీన్లలో ఈ టెక్నిక్స్‌ను ఉపయోగిస్తుండగా, ఇంగ్లీష్ సినిమాలలో పూర్తిగా మల్టీమీడియా ఎఫెక్ట్‌లను మేళవించి మనలను ఊహాలోకాల్లో విహరింపచేస్తున్నారు. మనం ఒక గంటలో చూసిన సినిమా లేదా కార్టూన్ ఫిల్మ్ వెనక అనేకమంది వివిధ స్థాయిల్లో నెలల తరబడి చేసిన శ్రమ ఉంటుంది. ఈ యానిమేషన్ ప్రక్రియకు కంప్యూటర్లను వినియోగించక ముందు ప్రతి ఫ్రేమ్‌నూ మాన్యువల్‌గానే సిద్ధం చేసుకోవాల్సివచ్చేది. ఇంతటి ప్రాచుర్యం పొందిన మల్టీమీడియా అంటే ఏమిటి? యానిమేషన్ అంటే ఏమిటి? దీనివల్ల యువతకు ఏ రకమైన ఉపాధి లభిస్తుంది? అందుకు చేయాల్సిన కోర్సులు ఏమిటనేది తెలుసుకుందాం.



యానిమేషన్...

కె ఎక్స్ రాజు



కంప్యూటర్ సాయంతో టెక్స్ట్, ఆడియో, చిత్రాలను మిశ్రమం చేయడాన్నే మల్టీమీడియా అంటారు. సహజత్వానికి భిన్నంగా ఊహా ప్రపంచాన్ని కళ్ళముందుంచడమే మల్టీమీడియా చేసే పని. దీనికి ఉదాహరణగా జురాసిక్‌పార్క్‌లోని డైనోసార్‌ను పేర్కొనవచ్చు. నిజానికి భూమిపై ప్రస్తుతం డైనోసార్ లేకపోయినా నిజమైన డైనోసార్‌లా భ్రమింపచేస్తుంది. అదేవిధంగా 'భారతీయుడు' సినిమాలో కమల్‌హాసన్ జంతువుగా మారడం వంటి టెక్నిక్స్ అన్నీ మల్టీమీడియా ఎఫెక్ట్‌లే. మల్టీమీడియా ఓ అద్భుతం. స్వప్నాల్ని కళ్ళముందు సాక్షాత్కరింపచేసే అద్భుత ప్రక్రియ. దీనిలోని ఒక ప్రధాన విభాగమే యానిమేషన్. జంగిల్‌బుక్ అనే కార్టూన్ ఫిల్మ్, జురాసిక్ పార్క్, టాయ్‌స్టోరీ, డెన్నిస్ ది మెనేస్, బ్యూటీ అండ్ ది బీస్ట్, టామ్ అండ్ జెర్రీ, సిండరెల్లా, స్టార్‌షిప్ ట్రూపర్స్, గాడ్జిల్లా వంటి సినిమాల్లోని గ్రాఫిక్స్ అన్నీ ఈ యానిమేషన్ ద్వారా రూపొందించినవే. చేతితో గీసిన బొమ్మలకు కదలికలను ఏర్పరచి, వాటికి కావాల్సిన రంగులద్ది, అనేక ఫ్రేమ్‌ల కలయికతో ఈ యానిమేషన్‌లను రూపొందిస్తారు.

స్పైడర్‌మేన్ ఒక బిల్డింగ్ నుంచి మరొక బిల్డింగ్‌కి నన్నని దారం

వాల్‌డిస్నీ

6 ● ఆదివారం ప్రజాశక్తి ● 25 జులై 2004

యానిమేషన్ ప్రాసెస్



యానిమేషన్‌ను తయారు చేయాలంటే ఒక క్రమ పద్ధతి అవసరం. మొదటిగా మనం చేయాలనుకున్న యానిమేషన్ యొక్క స్టోరీ, స్క్రిప్ట్‌లను తయారుచేసుకోవాల్సివుంటుంది. ఆ తర్వాత ఆ స్టోరీలో వచ్చే క్యారెక్టర్స్ అన్నింటినీ కంప్యూటర్‌లోనే డిజైన్ చేసుకోవాలి. దీని తర్వాత స్టోరీని బట్టి దానికి అవసరమైన బ్యాక్‌గ్రౌండ్స్‌ను తయారు చేసుకోవాలి. ఉదాహరణకు ఏదైనా పార్క్‌లో ఒక సీన్ తయారు చేయాల్సివచ్చినప్పుడు బ్యాక్‌గ్రౌండ్‌లో ఆ పార్కుకు సంబంధించిన ఇమేజ్‌లను గీసుకొని దానికవసరమైన ఎఫెక్ట్‌లను సిద్ధం చేసుకోవాలి. ఆ తర్వాత అవసరమైన క్యారెక్టర్స్‌ను ముందే సిద్ధం చేసుకున్న బ్యాక్‌గ్రౌండ్‌పై ప్రవేశపెట్టి, దానికి అవసరమైన కదలికలను ఇవ్వాలి. చివరిగా సన్నివేశానికి అవసరమైన సౌండ్స్‌ను మిక్స్ చేయాలి. మొత్తం తయారైన తర్వాత విజువల్ ఎడిటింగ్, క్వాలిటీ చెకింగ్‌లను చేయాలి. సినిమాలలో కూడా యానిమేషన్‌లను దాదాపుగా ఇదేరకంగా తయారు చేస్తారు.

☛ **కెరీర్:** యానిమేషన్‌ను నేడు పలు రంగాలలో ఉపయోగిస్తున్నారు. దీనిని వృత్తిగా స్వీకరించేవారికి డ్రాయింగ్, ఏ ఇమేజ్ ఎలా వుంటే బాగుంటుందనే అంశంపైన, వివిధ సాఫ్ట్‌వేర్స్‌పై కూడా పూర్తి అవగాహన వుండాలి. యానిమేషన్‌కు ముఖ్యంగా సృజనాత్మకత అవసరం. సృష్టికి ప్రతిసృష్టి చేయగలిగే విధంగా ఆలోచించగలిగినప్పుడే తప్పక రాణించగల అవకాశం ఈ రంగంలో వుంది.

☛ **ఉద్యోగావకాశాలు:** ఈ రంగంలో అనేక ఉద్యోగావకాశాలు వున్నాయి. ముఖ్యంగా క్యారెక్టర్ యానిమేటర్, క్యారెక్టర్ మోడలింగ్ ఆర్టిస్ట్, క్రియేటివ్ డైరెక్టర్, గ్రాఫిక్స్ డిజైనర్, ఇన్‌స్ట్రక్షనల్ డిజైనర్, ప్రోగ్రామర్, క్లీన్‌అప్-ఆర్టిస్ట్, డిజిటల్ కంపోజర్, ఎఫెక్ట్స్ యానిమేటర్, ఇంక్ అండ్ పెయింట్ ఆర్టిస్ట్, లేఅవుట్ ఆర్టిస్ట్, క్వాలిటీ చెక్కర్ వంటివి అనేకం వున్నాయి. కాస్త క్రియేటివిటీ, మరికాస్త ఓర్పు, సహనం వున్నవారు ఈ రంగంలో బాగా రాణిస్తారు.

☛ **ఎక్కడ నేర్చుకోవాలి :** ప్రభుత్వ, ప్రైవేట్ సంస్థలు యానిమేషన్ సంబంధిత కోర్సులను అందిస్తున్నాయి. అయితే ఈ కోర్సులు చేయాలనుకునేవారు ఏదో ఒకదానిలో చేరిపోవడం కాకుండా ఆయా ఇన్‌స్టిట్యూట్‌లలో ల్యాబ్ సౌకర్యం, ఫ్యాకల్టీ, ఫీజులు, స్టడీ మెటీరియల్ వంటివి అందుబాటు గురించి తెలుసుకోవాలి. కోర్సు ఫీజు ఇన్‌స్టిట్యూట్‌ను బట్టి రూ. 10వేల నుంచి రూ. 30వేల వరకూ వుంటాయి. వీటన్నింటినీ పరిగణనలోకి తీసుకొని అందుబాటులోవున్న ఇన్‌స్టిట్యూట్‌లో చేరవచ్చు. అంతేకాకుండా సొంత కంప్యూటర్ వుండి చదివి అవగాహన చేసుకోగలిగితే సంబంధిత పుస్తకాలు కొనుక్కుని సొంతంగానూ నేర్చుకోవచ్చు.

ఉపయోగించి ప్రయాణించినా, జురాసిక్ పార్క్‌లో రాక్షసి బల్లులు పెద్ద పెద్ద కార్లను తమ నోటిలో ఇరికించుకుని పరిగెత్తినట్లు చిత్రీకరించినా, మిషన్ ఇంపాజిబుల్ లోని పోరాటదృశ్యాలైనా అన్నీ కంప్యూటర్ల సాయంతో చిత్రీకరించబడినవే. హాలీవుడ్ సినిమాలలో మాత్రమే గాక మన దేశంలో కూడా స్పెషల్ ఎఫెక్ట్‌లకు కంప్యూటర్లను ఉపయోగించడం అధికమైంది. జుబేదా, రాజు చాచా, మిషన్ కాశ్మీర్ వంటి ప్రసిద్ధ హిందీ చిత్రాలతో బాటు భారతీయుడు, దేవీపుత్రుడు, అమ్మోరు, అంజి వంటి తెలుగు చిత్రాలలో స్పెషల్ ఎఫెక్టులు కంప్యూటర్లలోనే రూపొందించబడ్డాయి. దాదాపు 10 శాతం దేశీయ సినిమాలలో ఏదో ఒక యానిమేషన్‌ని ఉపయోగిస్తున్నారు.

మిక్కీ మౌస్, స్పైడర్‌మేన్ వంటి క్యారెక్టర్లు కేవలం పాశ్చాత్య దేశాలలో మాత్రమేగాక, భారతదేశంలో కూడా పిల్లలను, పెద్దలను అలరిస్తున్నాయి. ఈ కార్టూన్ సామ్రాజ్యానికి రారాజుగా వెలుగొందుతున్న వాల్ట్‌డిస్నీ రూపొందించిన కార్టూన్ క్యారెక్టర్ మిక్కీ మౌస్ 95 సంవత్సరాల తర్వాత కూడా నేటికీ సజీవంగానే వుంది. కంప్యూటర్ల వినియోగం పెరగడంతో అంతవరకూ చేతితో డ్రాయింగ్‌లు వేసి రూపొందించే యానిమేషన్ చిత్రాల స్థానంలో కంప్యూటర్లు రూపొందించిన యానిమేషన్లు, స్పెషల్ ఎఫెక్టులు చిత్రాలలో చోటు చేసుకోనారంభించాయి. 1977లో జార్జ్ లూకాస్ విడుదల చేసిన స్టార్‌వార్స్, స్టీవెన్ స్పీల్‌బర్గ్ Close Encounters of the Third Kind వంటి చిత్రాలు స్పెషల్ ఎఫెక్ట్‌లకు కొత్త నిర్వచనాన్ని చెప్పాయి. 1982లో డిస్నీ సంస్థ తీసిన పూర్తిస్థాయి కంప్యూటర్ జనరేటెడ్ విజువల్ ఎఫెక్ట్ చిత్రం Tranతో చిత్రాలలో స్పెషల్ ఎఫెక్ట్‌లకు కంప్యూటర్ల వినియోగం ప్రారంభమైంది.

భారతదేశంలో కూడా చాలాకాలం క్రితమే యానిమేషన్ ప్రారంభమైంది. దేశీయంగా మొట్టమొదటి యానిమేటెడ్ చిత్రం 'The Growth of a Pea Plant'ను దాదాసాహెబ్ ఫాల్కె 1912లో రూపొందించారు. అయితే ఇది విడుదల కాలేదు. అయినప్పటికీ ఒక నూతన ఆవిష్కరణకు నాంది పలికింది. మళ్లీ 22 సంవత్సరాల తర్వాత 1934లో న్యూ థియేటర్స్ సంస్థ వారు 'The Pea Brothers' అనే మొట్టమొదటి యానిమేటెడ్ చిత్రాన్ని విడుదల చేశారు. 1969లో విడుదలైన 'Bhuvan Shome" చిత్రంతో ప్రఖ్యాత భారతీయ యానిమేటర్ రామ్‌మోహన్ ద్వారా ఫీచర్ ఫిల్మ్‌లలో కూడా యానిమేషన్‌లను జోడించే ప్రక్రియకు శ్రీకారం చుట్టింది.

అవుట్‌సోర్సింగ్

ఇంతవరకూ కేవలం సాఫ్ట్‌వేర్ డెవలప్‌మెంట్, బిజినెస్ ప్రాసెస్ అవుట్‌సోర్సింగ్ వంటి ఐటీ సర్వీస్‌ల రంగంలో విజయాన్ని చవిచూసిన భారతీయ సంస్థలు ఈ నూతన రంగం ఫలితాలను కూడా అందుకోవాలని ఉవ్విళ్ళూరుతున్నాయి. ఇప్పటికే పలు యానిమేషన్ సంస్థలు దేశంలో ప్రారంభం కాగా, మరెందరో ఔత్సాహికులు ఈ రంగంలో అడుగిడడానికి సన్నాహాలు చేసుకుంటున్నారు. సాఫ్ట్‌వేర్ డెవలప్‌మెంట్, ఇతర బేక్ ఆఫీస్ ఆపరేషన్ల మాదిరిగానే అమెరికా, కెనడాలలోని పెద్ద సంస్థలు తమ యానిమేషన్ డెవలప్‌మెంట్‌ని అవుట్‌సోర్సింగ్ చేయనారంభించాయి. దీంతో ఒక్కసారిగా ఈ రంగంలో వేడిపుట్టింది. ఈ నేపథ్యంలో అసలు ప్రపంచ యానిమేషన్ రంగం ఎలా వుంది, అందులో భారతదేశం ఏ స్థాయిలో వుందనే అంశాలతోబాటు ఈ రంగంలో ఉద్యోగావకాశాలు, దానికి కావాల్సిన అర్హతలను తెలుసుకోవడం ఉపయోగకరం.

ఈ మధ్యకాలంలో పరిస్థితి పూర్తిగా మారిపోయింది. అమెరికా, కెనడాలలోని స్టూడియోలు తమ డిజిటల్ యానిమేషన్ ఖర్చును తగ్గించుకోవడానికి ఆసియా దేశాలకు అవుట్‌సోర్స్ చేయడం ప్రారంభించాయి. దీంతో హాలీవుడ్ చిత్రాలలోని కొన్ని



యానిమేషన్‌ను రెండు రకాలుగా విభజించవచ్చు. 1. Frame Animation, 2. Cast Animation. Frame Animation : ఏదైనా ఒక సన్నివేశానికి అనుగుణంగా కావాల్సిన కదలికలను ఒక చిత్రకారుడు వివిధ ఫ్రేమ్‌లుగా గీసి, నియమిత వేగంతో చూపిస్తే అది యానిమేషన్‌గా రూపొందుతుంది. దీన్ని ఫ్రేమ్ యానిమేషన్ అంటారు.

యానిమేషన్‌లో రకాలు

Cast Animation : ఒక సన్నివేశంలోని పాత్రలను ఒక్కో ఆబ్జెక్ట్‌గా తీసుకొని, దాని కదలికలకు సంబంధించిన పొజిషన్, ప్యాట్రెన్, సైజ్, షేప్, పాత్ వంటివాటికి అనుగుణంగా కదలికలను సృష్టిస్తూ తయారుచేసిన ఆబ్జెక్టులన్నింటినీ కలిపి కొన్ని సన్నివేశాలను తయారు చేయడాన్నే Cast Animation అంటారు. దీనిలో 1. 2డి యానిమేషన్, 2. 3డి యానిమేషన్ 3. డిజిటల్ వీడియో ఎఫెక్ట్స్.

2డి యానిమేషన్: దీనిలో పొడవు (x-axis), వెడల్పు (y-axis) అనే రెండు డైమన్షన్స్ మాత్రమే వుంటాయి. డెప్త్ (z-axis) వుండదు. ఇది పాత తరం యానిమేషన్ అయినప్పటికీ ఇప్పటికీ అనేకమంది దీన్ని ఉపయోగిస్తున్నారు. ఎత్తు, వెడల్పులను తీసుకొని కొన్ని బొమ్మలను తయారుచేసి, వాటికి కావాల్సిన రంగులు అపాదించి, వాటిని నడిపించడం, పరుగెత్తించడం వంటి రకరకాల కదలికలను ఇవ్వొచ్చు. దీనిలో చిన్నచిన్న అడ్వర్టయిజ్‌మెంట్లు, కార్టూన్ ఫిల్మ్‌లు తయారు చేయవచ్చు.

3డి యానిమేషన్: 2డి కంటే 3డిలో తయారు చేసిన యానిమేషన్‌లో నాణ్యత ఎక్కువగా కనిపిస్తుంటుంది. ఇందులో పొడవు, వెడల్పులతో పాటు డెప్త్ కూడా వుంటుంది. అందువల్ల ఏదేని ఆబ్జెక్ట్‌ను స్పష్టంగా చూడగలం. కొత్తగా కట్టే బిల్డింగ్స్‌ను 2డి కంటే 3డిలో చూడటం వలన అన్ని కోణాలలో చూడగలం. ఈ పద్ధతిలో బొమ్మలను తయారుచేయడం చాలా క్లిష్టమైన పనే అయినప్పటికీ, అద్భుతమైన ఎఫెక్ట్‌లతో ఆకర్షణీయంగా చేయవచ్చు.

డిజిటల్ వీడియో ఎఫెక్ట్స్: ఏదేని 2డి, 3డి బొమ్మలకు కదలికలను ఏర్పరచడం, మార్ఫింగ్ ద్వారా ఒక ఆబ్జెక్ట్ మరో ఆబ్జెక్ట్‌గా మారడం వంటి ఎఫెక్ట్‌లు, Warping, ఎడిటింగ్, బ్యాక్‌గ్రౌండ్‌లను మార్చడం, బొమ్మల కదలికలను నియంత్రించడం వంటివి దీనిలో చేయవచ్చు.



భాగాలను భారతదేశంలోని యానిమేషన్ స్టూడియోలలో రూపొందిస్తున్నారు. ప్రపంచం మొత్తం మీద జరుగుతున్న యానిమేషన్ వ్యాపారం సుమారు 2.3 లక్షల కోట్ల రూపాయలు కాగా, మనదేశపు వాటా కేవలం రు. 2,500 కోట్లు మాత్రమే. ప్రపంచంలోని యానిమేషన్‌లో 48 శాతం అమెరికాలోనే జరుగుతోంది. ఫ్రాన్స్‌లో సుమారు 26శాతం, జపాన్, కొరియాదేశాల్లో కలిపి 26 శాతం జరుగుతోంది. ఒక గంట యానిమేషన్ చిత్ర రూపకల్పనకు అమెరికాలో 4 నుంచి 5 లక్షల డాలర్లు ఖర్చవుతోంది. దీంతో ఆ దేశంలోని ప్రముఖ నిర్మాణ సంస్థలు తక్కువ ఖర్చుతో యానిమేషన్‌లు రూపొందించగల దేశాల కోసం అన్వేషణ ప్రారంభించాయి. అవుట్‌సోర్సింగ్‌లో సైతం యానిమేషన్‌కు ప్రాధాన్యత పెరగడంతో మనదేశంలోని సాఫ్ట్‌వేర్ సంస్థల అసోసియేషన్ 'నాస్కామ్' యానిమేషన్ రంగం వైపు కూడా దృష్టి మళ్ళించింది. ప్రస్తుతం 45 బిలియన్ డాలర్లుగా వున్న యానిమేషన్ మార్కెట్ 2005 నాటికి 70 బిలియన్ డాలర్లకు చేరుతుందని నాస్కామ్ అంచనా. ఇప్పటికే దేశంలో 40కి పైగా యానిమేషన్ సంస్థలు బెంగుళూరు, చెన్నయ్, ఢిల్లీ, హైదరాబాద్, ముంబయి, తిరువనంతపురం వంటి నగరాలలో వెలిశాయి.

వీటిలో చెన్నయ్‌కి చెందిన పెంటామీడియా (గ్రాఫిక్స్), బెంగుళూర్‌కి చెందిన జాదువర్క్స్, ముంబాయిలోని యు.టి.వి.టూన్స్, చండీఘర్‌లోని సిడి ఇండియా, నోయిడాలోని మూవింగ్ పిక్చర్ కంపెనీ, హైదరాబాద్‌కి చెందిన కలర్‌చిప్స్, హార్ట్ ఎంటర్‌టైన్‌మెంట్, తిరువనంతపురంకి చెందిన టూన్జ్ యానిమేషన్, మాయా ఎంటర్‌టైన్‌మెంట్, టాటా ఎలక్సీ, డిజిటల్ ఆర్ట్ మీడియా వంటి సంస్థలు యానిమేషన్‌లో పేరు సంపాదించాయి. అయితే మనదేశంలో యానిమేషన్ నిపుణుల కొరత చాలా ఎక్కువగా వుంది. నాస్కామ్ వారి అంచనాల ప్రకారం దేశంలో సుమారు 25 వేలమంది యానిమేషన్ నిపుణులు అవసరం కాగా, ఐదు వేల మంది మాత్రమే అందుబాటులో వున్నారు. ఈ రంగంలో దేశీయ సంస్థలు మరింత అభివృద్ధి సాధించాలంటే నిపుణుల కొరతను అధిగమించాల్సివుంది.



యానిమేషన్ అంటే?

యానిమేషన్ అంటే ఏదైనా ఒక ఆబ్జెక్ట్‌కు మనకు కావాల్సిన విధంగా కదలికలను ఏర్పరచి ఒక క్రమపద్ధతిలో కదిలేలా చేయడమే. ఈ క్రమంలో కదలిక మాత్రమే గాకుండా బ్యాక్‌గ్రౌండ్‌లో పలు రకాల స్పెషల్ ఎఫెక్ట్స్, విజువల్ ఎఫెక్ట్స్‌ను కూడా జోడిస్తారు. సౌండ్స్, టెక్ట్స్ వంటివాటిని కూడా జోడిస్తారు. ఈ విధంగా జరిగే మొత్తం ప్రాసెస్‌ను యానిమేషన్ అంటారు. మొత్తంగా దీన్ని చిత్రాలు, శబ్దాలు, టెక్ట్స్, గ్రాఫిక్స్, విజువల్‌ల కలయిక అని చెప్పవచ్చు. ఈ యానిమేషన్ అనే పదం లాటిన్ భాషలోని 'అనిమా' నుంచి పుట్టింది. లాటిన్‌లో అనిమా అంటే కదలిక లేని క్యారెక్టర్స్‌కు ప్రాణం పోయడమనే అర్థం వస్తుంది. ప్రస్తుతం యానిమేషన్ ద్వారా జరుగుతున్న ప్రాసెస్ కూడా ఇదే. యానిమేషన్ అంటే లేనిదాన్ని వున్నట్లు చూపించడమే. ప్రస్తుతం భూమిపై ఎక్కడా డైనోసార్స్ లేవు. కాని జురాసిక్ పార్క్ సినిమాలో ఇవి వున్నట్లుగా చూపించారు. అంటే ఇక్కడ వాస్తవంగా చిత్రాలను తీయలేదు. కంప్యూటర్‌లో యానిమేషన్ ప్రాసెస్ ద్వారా డైనోసార్స్‌ను సృష్టించారు.

యానిమేషన్ సృష్టి ఇలా జరిగింది?

యానిమేషన్ కాన్సెప్ట్ ఇటీవలిది కాదు. ఎప్పటి నుంచో ఉన్నప్పటికీ టెక్నాలజీ ప్రవేశించిన తర్వాత మరింత అభివృద్ధి చెందింది. దీని గురించి మొదటిగా 1824లో Peter Roget "The persistance of vision with regard to moving objects" అనే Themeగా British Royal Societyకి సమర్పించాడు. అయితే 1889లో థామస్ ఎడిసన్ ఈ రంగంలోకి ప్రవేశించడంతో యానిమేషన్ రంగ అభివృద్ధి ప్రారంభమైందనే చెప్పాలి. ఈయన యానిమేషన్‌లను చూడడం కోసం Kinetoscopeను తయారు చేశాడు. దీనితో 50 అడుగులు గల ఫిల్మ్‌ను దాదాపు 13 సెకండ్స్‌లో చూడవచ్చు. ఆ తర్వాత 1906లో J.Stuart Block మొదటిసారిగా "Humorous Phases of Funny Faces" అనే పేరుతో యానిమేషన్‌ను తయారు చేశాడు. మొదట్లో కాగితం మీద గీసిన బొమ్మలను ఫొటో తీయడం ద్వారా యానిమేషన్లను తయారు చేసేవారు. 1923లో Walt Disney "Alice's Wonderland" ద్వారా యానిమేషన్ రంగంలోకి అడుగుపెట్టాడు. 1928లో విడుదలైన 'Steam boat willie' వాల్ట్ డిస్నీకి మంచి పేరు తెచ్చిపెట్టింది. Synchronised Sound Trade కలిగిన మొట్టమొదటి పిక్చర్ ఇదే. 1960లో కంప్యూటర్స్ ద్వారా అసలైన యానిమేషన్ మొదలైంది. 1995లో Toystory, 1996లో Gragon Heart, 1998లో Starwars, Titanic, MIB, 1999లో Dinosaur నుంచి ఇటీవల విడుదలైన Mummy, Final Fantasy, Matrix, The Bugs life వంటి సినిమాలన్నింటిలోనూ కంప్యూటర్ ద్వారా యానిమేషన్ ఎఫెక్ట్‌లను సృష్టించారు. ◆

అంబాడుతూ, కూర్చొని, తప్పటడుగులతోటి కేరింతలు కొడుతూ ఎదుగుతున్న పసి బిడ్డల బొమ్మలు 'బేబీ షో'లాగ గదిలో గోడలకు అలంకరించబడినాయి. ఒక్కొక్క బొమ్మను తన్మయత్వంతో పులకరించిపోతూ అదేపనిగా చూస్తూ కూర్చుంది శ్రీలక్ష్మి.

ఎనిమిదవ నెల గర్భిణి శ్రీలక్ష్మి. తన కడుపులోని బిడ్డ కూడా అదే విధంగా పెరుగుతుందని ఆనందంతో మురిసిపోతోంది.

ఆడపిల్ల

ఈ రోజు ఆఫీసు నుండి ఇంటికి రాగానే గుడికెళ్దామని చెప్పాడు శ్రీలక్ష్మి భర్త శ్రీధర్. అందుకే అందంగా అలంకరించుకొని భర్త రాకకోసం ఎదురుచూస్తోంది, ఇంకా రాలేదని బయటికొచ్చి చూస్తుండగానే రానేవచ్చాడు శ్రీధర్. అతను కూడా గబగబా తయారయి ఇద్దరూ బయలుదేరారు.

గుడికి పోదామని చెప్పి నర్సింగ్ హోమ్‌కు తీసుకొచ్చాడు శ్రీధర్ అతని భార్యను. శ్రీలక్ష్మి అయోమయానికి గురయింది. ఆమె ఎంత అరిచి మొత్తుకుంటున్నా స్కానింగ్ తీయించాడు.

స్కానింగ్ రిపోర్ట్స చూసి ఆడపిల్ల పుడుతుందని చెప్పాడు డాక్టర్.

శ్రీధర్‌లో అప్పటి వరకున్న ఆనందం ఒక్కసారిగా మటుమాయమయింది. శ్రీలక్ష్మిలో స్కానింగ్ తీయించిన బాధ కొంత తొలిగి ఆమెలో ఆనందం వెల్లివిరిసింది. ఎవరి ఆలోచనలతో వారు మౌనంగా ఇంటికి చేరుకున్నారు.

"గర్భిణీ స్త్రీలను స్కానింగ్ తీయొద్దని ఒకవైపు సమాజం, మరోవైపు ప్రభుత్వ చట్టాలు ఘోషిస్తున్నా మీ పురుషాధిక్యతను నాపై ప్రయోగించారు. ఇది మంచి పద్ధతి కాదండీ" అన్నది శ్రీలక్ష్మి ఆవేదనగా.

"ఈ చట్టాన్ని ఎవరు ఆదరిస్తున్నారు ఎవరు గౌరవిస్తున్నారని? స్కానింగ్‌లు తీయించుకొని ఆడపిల్ల పుడుతుందని తెలిసి ఎంతమంది అబార్షన్లు చేయించుకోవడంలేదు?" అన్నాడు సవాలుగా శ్రీధర్.

"అవునండీ అలా చేయించుకోవడం వల్లనే స్త్రీలకున్న స్థానం ఇలా దిగజారిపోతోంది. నవ మాసాలు మోసి కని పెంచేది ఆడది కాదా! ఈ సృష్టికి మూలం స్త్రీ కాదా! పైగా మీరు స్త్రీ శిశు సంక్షేమ శాఖలో పనిచేస్తూ ఆడపిల్లపై ఎందుకింత వివక్ష చూపుతున్నారు? ఇది మీకు న్యాయంగా ఉందా?" అంటూ శ్రీలక్ష్మి భర్తకు ఎదురు తిరిగింది.

"లక్ష్మీ.. నా మాట విని ఆబార్షన్ చేయించుకో" అన్నాడు శ్రీధర్ ఒక నిర్ణయానికి వచ్చినవాడిలా.

భర్త ఆ విధంగా అనడంతో శ్రీలక్ష్మికి భూప్రళయం వచ్చినంత పనయింది. అరచికేకపెట్టి కళ్ళు తిరిగి పడిపోయింది.

వెంటనే శ్రీధర్ నీళ్ళు తెచ్చి ముఖంపై చల్లి తన ఒడిలోకి తీసుకున్నాడు భార్యను.

"ఏవండీ కలలోకూడా ఇంకోసారి ఆ మాట అనకండి! మీరు ఆ పని చేస్తే నేను బ్రతకలేను, నాప్రాణం తీసుకుంటా!" మెల్లగా కళ్ళు తెరిచి సూటిగా భర్త కళ్ళలోకి చూస్తూ అన్నది శ్రీలక్ష్మి.

భార్య ఆవిధంగా అనేసరికి శ్రీధర్ ఒక విధమైన భయానికి లోనయ్యాడు.

"అలాగే నీ ఇష్టం" అంటూ ఏడుస్తున్న శ్రీలక్ష్మిని సముదాయించి బయటికి వెళ్ళాడు శ్రీధర్.

కొడుకు పుడతాడని అనుకున్న ఆశ నిరాశగా మారి ఒక్కసారిగా కృంగదీసింది శ్రీధర్‌ను.

సృష్టికి మూలం స్త్రీ. తొలి కాన్పు ఆడపిల్ల పుట్టాలని, ఇంట్లో లక్ష్మి వెలగాలని ఆశలు పెట్టుకుంది శ్రీలక్ష్మి. తన నమ్మకం వమ్ముకాలేదని ఎంతగానో సంతోషించింది. కాని.. ఆమె భర్త ప్రవర్తనకు మాత్రం ఎంతగానో నొచ్చుకొని ఆవేదన పడింది.

శ్రీలక్ష్మి డిగ్రీ వరకు చదువుకుంది. పెళ్ళికి ముందే శ్రీధర్ తల్లిదండ్రులు తిరుపతి యాత్రకని వెళ్లి బస్సు ప్రమాదంలో పోయారు. శ్రీలక్ష్మి విద్యావంతురాలని ఏరికోరి ఆమెను పెళ్ళి చేసుకున్నాడు శ్రీధర్. పెండ్లయిన రెండేళ్ళ నుండి భార్యా భర్త లిద్దరూ అన్ని విషయాలలో అవగాహన కలిగి ఉంటున్నారు, అన్యోన్యంగా జీవిస్తున్నారు, కాని ఆడబిడ్డా! మగబిడ్డా! అనే విషయంలో మాత్రం విభేదాలు పొడ సూపుతున్నాయి.

కూతురుపుడుతుందని శ్రీలక్ష్మి, కొడుకు పుడతాడని శ్రీధర్, ఇలా వాదోపవాదాలు పెరుగుతున్నాయి రెండు నెలలుగా. భర్త స్కానింగ్ తీయించాలని గొడవ పెడుతుంటే వద్దని గొడవపడుతూ వచ్చింది శ్రీలక్ష్మి. చివరికిలా మోసం చేసి స్కానింగ్ తీయిస్తాడనుకోలేదు శ్రీలక్ష్మి.

శ్రీలక్ష్మి అన్న లక్ష్మయ్య వచ్చి తొలికాన్పుకు పుట్టింటికి తీసుకెళ్ళాడు.

అబార్షన్ చేయించమని భర్త చేసిన గొడవ పుట్టింట ఎవరికీ చెప్పదలుచుకోలేదు శ్రీలక్ష్మి.

ఉన్నట్లుండి ఒకరోజు శ్రీలక్ష్మి నొప్పులు పడుతుంటే వెంటనే సర్కారు ధవాఖానలో చేర్పించింది తల్లి నిర్మలమ్మ. శ్రీధర్‌ను రమ్మని ఫోన్ చేసి చెప్పాడు లక్ష్మయ్య. తల్లి, అన్న ఇద్దరూ లక్ష్మిని ధవాఖానలో జాగ్రత్తగా చూసుకుంటున్నారు.

మరుసటిరోజు ఉదయం లక్ష్మికి నొప్పులు

(మిగతా 19వ పేజీలో)

కళాజీవితం, వ్యక్తిగత జీవితం వేర్వేరా ?



అంపశయ్య నవీన్

"ఈ మధ్య మీరు చాలా మందికి సర్టిఫికెట్లు ఇచ్చేస్తున్నట్టున్నారే!"

"నేను సర్టిఫికెట్లు ఇవ్వడమేమిటి?"

"మీరు పెద్దరచయితలు కదా.. చిన్న రచయితలకు పెద్ద రచయితలు ముందుమాటల రూపంలో సర్టిఫికెట్లు ఇచ్చేస్తుంటారు కదా..."

"ఓహో! నువ్వు మాట్లాడుతున్నది "ముందుమాటల" గురించా?.."

"అవును.. ఈ మధ్య మీరో వర్ధమాన రచయిత పుస్తకానికి రాసిన ముందుమాట చదివాను... అతనికి మీరు చాలా పెద్ద కితాబే ఇచ్చారు"

"అంటే అతిగా పొగిడాననా మీ ఉద్దేశ్యం"

అతిగా పొగిడారని కాదుగానీ మీలాంటి ఒక సచ్చరిత్రుడైన సీనియర్ రచయిత అలాంటి చరిత్రహీనులు రచించే పుస్తకాలకు ముందుమాటలు రాయడమే నాకు నచ్చలేదు.."

"ఇంతకూ మీరు చెబుతున్నది ఏ రచయితలకు రాసిన ముందుమాటల్ని గురించి?"

"ప్రభాకర్ అని ఈ మధ్య తన కథల్ని ప్రచురించుకున్నాడు చూడండి.."

"ఓహో... ప్రభాకర్ కథలకు రాసిన ముందుమాట గురించా నువ్విలా మాట్లాడుతున్నది... నేను రాసిన ఆ ముందుమాటలో ఆ కథల్ని గూర్చిన విశ్లేషణ తప్ప మరేదీ రాయలేదే! అతిగా పొగడటం కూడా చెయ్యలేదే..."

"అతిగా పొగిడారని కాదు కానీ ఈ ప్రభాకర్ అనే వాడు ఎలాంటి వాడో మీకు తెలియదా?"

"అతని వ్యక్తిగత జీవితాన్ని గూర్చి నాకేమీ తెలీదు.. తెలియాల్సిన అవసరం కూడా లేదు.. అతడో యువ రచయిత... నేను కొన్ని కథలు రాశాను. వాటిని పుస్తక రూపంలో తీసుకొస్తున్నాను... మీరా కథలకొక ఉపోద్ఘాతం లాంటిది రాస్తే చాలా సంతోషిస్తాను సార్! అంటూ వచ్చాడతడు... అతడు రాసిన కథల్ని నేను ఇదివరకే ఆయా పత్రికల్లో వచ్చినప్పుడు చదివాను... బాగానే రాస్తున్నాడనిపించింది... ప్రోత్సహిస్తే అతడు మంచి కథకుడౌతాడన్న నమ్మకం కలిగింది. అందుకే అతడు తన కథలకు ఉపోద్ఘాతం లాంటిది రాయమంటే రాసిచ్చాను. నేను రాసిన ఆ ఉపోద్ఘాతంలో అతని కథల్లో ఉన్న మంచీ, చెడూ... రెండూ చెప్పాను దాంట్లో తప్పేముంది?.."

"ఒక రకంగా చూస్తే దాంట్లో ఉన్న తప్పేమిటో మీకూ అర్థమవుతుంది?"

"ఏమిటా ఒకరకంగా చూడటం?"

"అతడెలాంటి వాడు.... అతని క్యారెక్టర్ ఏమిటి? అతని చరిత్ర ఏమిటి? సమాజానికి అతనివల్ల జరుగుతున్న హాని ఏమిటి? ఇవన్నీ చూశాకే అతనికి మీరు కితాబులివ్వాలి?

కేవలం 'ముందు మాట' రాయటానికి వాటితో నాకు సంబంధం లేదు. అందుకు అతడు రాసిన కథలే నాకు ముఖ్యం... ఇక్కడ వాటిల్లో ఉన్న మంచెమిటో... చెడేమిటో చెప్పడమే నేను చేసే పని. వ్యక్తిగత జీవితంలో అతడేం చేశాడో నేనిక్కడ చర్చించడం లేదు? అతడి తల్లిదండ్రులెవరు ? అతడెక్కడ పుట్టాడు ? ఎక్కడ చదివాడు? ఏం ఉద్యోగం చేస్తున్నాడు? ఎంత సంపాదించాడు ? ఎవర్ని పెళ్ళి చేసుకున్నాడు ? చేసుకున్నామెతో ఎలా కాపురం చేశాడు? ఎంతమంది పిల్లల్ని కన్నాడు... ఇవన్నీ ఇక్కడ నాకనవసరం..."

"అంటే.. వ్యక్తిగత జీవితం, ప్రజాజీవితం... రెండూ పూర్తిగా వేర్వేరేనంటారు?"

"ఈ విషయం వరకైతే అంతే"

"రచయిత అయిన వాడు తాను రాస్తున్న దాన్ని తన నిజజీవితంలో ఆచరించాల్సిన అవసరం లేదంటారా? నిజజీవితంలో నీచుడు, నికృష్టుడూ అయిన వాడు పెద్దపెద్ద ఆదర్శాలు బోధిస్తూ పుస్తకాలు రాయొచ్చునంటారా ? పూర్వం మన పెద్దలు ఋషికానివాడు కవికాలేడన్నారు... ఆ మాటలో వాస్తవం లేదంటారా?"

"ఋషి అయినవాడే కవిత్వం రాయాలి తప్ప మామూలు మనుషులు కవిత్వం రాయొద్దు అన్న నిబంధనలు పెడ్తే కవిత్వం రాసే వాళ్ళెవరూ మిగలరు... మామూలు మనుషులు కూడా గొప్ప కవిత్వం రాసిన దాఖలాలు ఎన్నో ఉన్నాయి. అయితే గొప్ప కవిత్వమో లేక గొప్ప నవలో లేక గొప్ప కథో రాస్తున్న క్షణాల్లో మామూలు మనిషి కూడా గొప్పవాడుగా మారిపోతాడు... అంటే గొప్ప కళాకారుడుగా మారిపోతాడు. అతడు రాస్తున్న ఆ కవితో... ఆ నవలో పూర్తయిందనుకోండి... అతడు తిరిగి మామూలు వ్యక్తిగా మారిపోతాడు. గొప్ప కళాఖండాన్ని సృష్టిస్తున్నప్పుడు ఆ రచయిత ఎంతో ఉన్నతుడుగా మారిపోతాడు. అతన్ని ఆ క్షణాల్లో గొప్ప సృజనశక్తి ఆవహిస్తుంది. అతడు ఆ క్షణాల్లో కళాకారుడు తప్ప మరేమీ కాదు. రాయడం పూర్తయిపోయాక అతడు మళ్ళీ మామూలు మనిషైపోతాడు. మామూలుగా అతనికుండే బలహీనతలు, వ్యసనాలన్నీ మళ్ళీ అతన్ని చేరుకుంటాయి... కాబట్టి మనకు కావల్సింది అతడో కళాకారుడుగా మారిపోయినప్పుడు అతడు చేసిన కళాసృష్టే! అతడా క్షణంలో రాసిన కవిత జాతిజనుల గుండెల్లో పలికితే.. ఆ కవితలో ప్రజలు తమను తాము చూసుకోగలిగితే... తమను తాము సంస్కరించుకొని ఉత్తమమానవులుగా మారడానికి ఆ కవిత దోహదం చేస్తే ఆ కవితను గొప్ప కవితంటాం. అంతేగాని ఆ కవితలో చెప్పిన దాన్ని ఆ కవి అతని వ్యక్తిగత జీవితంలో తు.చ. తప్పకుండా ఆచరించాడా? లేదా? అన్నది ముఖ్యం కాదు. అట్లా ఆచరించి ఉండకపోతే ఆ కవిత వృధా అనుకోవడం చాలా పొరపాటు. ఒక రచయిత రాసిన పుస్తకాల్లో సాహిత్య విలువలున్నాయా? లేవా? అన్నదే ముఖ్యం కానీ అతని వ్యక్తిగత జీవితంతో మనకు సంబంధం లేదు.

"మీరు చెప్పినదాన్ని బట్టి చూస్తే నిజజీవితంలో పరమదుర్మార్గుడైన వాడు కూడా గొప్ప రచయితగా చలామణి కావచ్చునన్నమాట.. పూర్వం బెర్‌ట్రాండ్ రస్సెల్ చెప్పిన మాటొకటి గుర్తొస్తున్నది.."

"ఏమిటది?..."

"రచయితలు అనే వాళ్ళు రెండు పనులు చేస్తుంటారట... ఒకటి: తమ రచనల్లో చెప్పిన వాటిని తమ నిజజీవితంలో ఆచరించకపోవడం. రెండు : నిజజీవితంలో ఆచరించే వాటిని రచనల్లో చెప్పక పోవడం. నేననేదేమిటంటే : నువ్వు ఆచరించని ఆదర్శాన్ని నీచుట్టూ వున్న వాళ్ళకు చెప్పే హక్కు నీకుందా? అని.

"కేవలం ఆదర్శాలను మాత్రమే చెప్పడం రచయితల పనికాదనుకుంటాను. వాస్తవ జీవితాన్ని విమర్శనాత్మకంగా చిత్రించడం రచయితల బాధ్యత. ఆదర్శాల్ని చెప్పడం తత్వవేత్తల పని. రచయితలు ఇలా రాయాలి, ఇలా రాయకూడదు అని చెప్పే హక్కు ఎవరికీ లేదు... కవి అయిన వాడు నిరంకుశుడని కూడా మన పెద్దలే చెప్పారు.. అతనికేది, ఎలా రాయాలనిపిస్తే అలా రాసేస్తాడు.. అతడు రాసిన దాంట్లో ఏది ప్రజల్ని కదిలిస్తుందో అదే మిగుల్తుంది. అయితే ఓ కవి తను రాసినదాన్ని తన జీవితంలో కూడా చూపిస్తే అతన్ని సమాజం ఇంకా గౌరవిస్తుంది. అది వేరే విషయం. కానీ గొప్ప కవిత్వం రాసిన వాడు ఆ రాసిన దాన్ని తన నిజజీవితంలో ఆచరించలేదన్న కారణం వల్ల అది గొప్ప కవిత్వం కాకుండా పోదు... ఉదాహరణకు మన మహాకవి శ్రీశ్రీనే తీసుకుందాం.. శ్రీశ్రీ రాసిన కవిత్వానికీ, శ్రీశ్రీ వ్యక్తిగత జీవితానికీ పొంతన లేదనే వాళ్ళు చాలా మంది ఉండొచ్చు. అంతమాత్రాన శ్రీశ్రీ రాసిన కవిత్వం గొప్ప కవిత్వం కాకుండా పోతుందా? ఈనాటికీ శ్రీశ్రీ కవిత్వం ప్రజల హృదయాల్లో జీవించి ఉందంటే అందుక్కారణం ఆ కవిత్వంలోని గొప్పతనమే గానీ ఆ కవి వ్యక్తిగత జీవితంలోని గొప్పతనం కాదు. కాబట్టి కవిత్వాన్ని కవిత్వంగా చూడాలే తప్ప దాన్ని అది రాసిన కవి వ్యక్తిగత జీవితంతో ముడిపెట్టి చూడకూడదు." ◆

వర్షం

అమ్మిన శ్రీనివాసరాజు

పేరూరులో అన్ని కులాలు, మతాల వాళ్లు కలిసిమెలిసి జీవించేవాళ్లు. వారిలో ఎక్కువమంది వ్యవసాయం చేసేవారు. మరికొంతమంది వ్యవసాయ కూలీలు. ఇలావుండగా ఆ సంవత్సరం వర్షాకాలం వచ్చినా వర్షం కురవలేదు. రైతులు పంటలు పండించాలన్నా, పొలం పనులు మొదలెట్టాలన్నా వర్షం అవసరం. చినుకులు లేకపోవడంతో భూగర్భ జలం కూడా ఇంకిపోయింది. దాంతో గొట్టపు బావుల్లో కూడా నీరు లేకుండా పోయింది.

వర్షం కోసం ఎవరి ప్రయత్నాలు వాళ్లు మొదలెట్టారు. కాపుల వాడ వాళ్లంతా కల్కి కప్పల పెళ్లి చేసి ఊరంతా ఊరేగించారు. గుళ్లో పూజలు చేశారు. నవాబు పేటోళ్లంతా మసీదులోనూ దర్గా దగ్గర ప్రత్యేక ప్రార్థనలు మొదలెట్టారు. పీరీలు ఊరేగించారు. క్రిస్టియన్ కాలనీ వాళ్లంతా చర్చిలో పవిత్ర ప్రార్థనలు చేశారు. సువార్త కూటములు చేపట్టారు.

అయినా వర్షం కురవకపోవడంతో అందరి ఆశలు అడియాశలే అయ్యాయి. అయినా ఎవరి నమ్మకాలు వారు ఆచరిస్తూనే వున్నారు.

అలా వారం రోజులు గడిచాయి. ఓ రోజు రాత్రి వున్నట్టుండి ఆకాశం మబ్బులు కమ్ముకుంది. అంతులేని ఈదురుగాలులు అందుకున్నాయి. చెట్లన్నీ చెల్లాచెదురుగా ఊగిపోతున్నాయి. గాలి పెరిగింది. దాంతో చిన్నగా వర్షపు జల్లు మొదలైంది. జల్లుల కాస్తా జోరువానగా మారింది. ఒకటే వాన. నింగి నేల ఏకమవుతాయా అన్నట్టు ధారాపాతంగా వాన కురుస్తోంది. వీధులన్నీ వరద నీళ్లతో మునిగిపోయాయి. ఈదురుగాలుల మోతలు, కప్పల బెకబెకలు, రొదలు ఒకవైపు.

కురిసిన వాన వల్ల ఆ గ్రామ ప్రజలకు కలిగిన ఆనందం మరోవైపు. ముసురు వానతో తెలతెలవారింది. ఆనందంతో అన్ని వాడల రైతులు గ్రామం మధ్యకు చేరుకున్నారు. 'మా ప్రార్థనల ఫలితమే ఈ వర్షం' అంటూ మొదలెట్టాడు ఖాసీం భయ్యా.

"అంతలేదు. ఇదంతా మేము చేసిన 'కప్పల పెళ్లి' ఫలితమే..." అంటూ కళ్లెర్ర జేశాడు కొండయ్య కాపు.

"అదేంకాదు. ఇదంతా మా ఏసయ్య రక్షే" అంటూ ముందుకు వచ్చాడు సువార్తయ్య. చినుకు చినుకు వర్షంలాగే మాటా మాటా పెరిగింది. ఎవరి మాట మీద వాళ్లు. మాటల తీరు పెరిగి గోల గొడవగా మారింది. ఒకరినొకళ్లు నెట్టుకుంటున్నారు. కోపంతో తిట్టుకుంటున్నారు. ఈ వర్షానికి మేము కారకులమంటే మేమంటూ ఊగిపోతున్నారు. ఎగిరిపడుతున్నారు.

అప్పుడే పక్కింట్లోని రేడియోలో ప్రాంతీయ వార్తలు ప్రారంభమయ్యాయి. "బంగాళాఖాతంలో ఏర్పడ్డ తుఫాను కారణంగా రాష్ట్ర వ్యాప్తంగా భారీవర్షాలు కురుస్తున్నాయి. రాగల 24 గంటల్లో కూడా విస్తృతంగా వర్షాలు కురుస్తాయి. సముద్రం అల్లకల్లోలంగా వుంటుంది......"

అందరి చెవులు అటువైపు మళ్లాయి. మళ్లీ మళ్లీ... తుఫాను హెచ్చరిక రేడియోలో ఎవరి ప్రార్థన ఫలితం ఈ ప్రమాదకరమైన తుఫాను?! "ఈ ప్రమాదానికి మాకు సంబంధం లేదు. అసలు మాకు తెలియదంటే తెలియదు" అన్నట్టు ఎవరి ఇళ్లకు వారు నడక మొదలెట్టారు.

నీతి: అంతే మరి. విజయానికి చాలామంది చుట్టాలు. పాపం అపజయమే అనాథ.



చిన్నారి చిత్రకారులు

పి.వెంకటేష్,
8వ తరగతి,
కె.జి.ఎం.పబ్లిక్‌స్కూల్.

ఎస్.కె.మున్ని,
6వ తరగతి.



జి.సంధ్య, 6వ తరగతి,
ఎంపిపి స్కూల్,
వెంకటాపురం, ఖమ్మం.



కె.స్నేహలత,
8వ తరగతి,
మధు విద్యాలయం, వైరా.



సిహెచ్.కృష్ణ సుకుమార్ శర్మ,
4వ తరగతి, కీర్తి విద్యాలయం,
మంగంపల్లి.

ఎవరు వీరు?



హేయ్ నేస్తాలూ! మీ ముందుకు వచ్చిన బుజ్జి జంతువు ఏదో టకామని చెప్పండి. చెప్పాలీ? ఇంతసేపా! గట్టిగా చెప్పాలి. కుందేలా? అర్రే పప్పలో కాలేశారుగా. మరో సారి చూసి చెప్పండి. కొందరు బాతు అంటున్నారు. ఇలా అయితే కుదరదు. ఏదో ఒకటి చెప్పాలి. ఒక జంతువు రెండుగా కనపడదుకదా. కుందేలు లేదా బాతు ఏదో ఒకటే చెప్పాలి. అలా అయితే కష్టమా. మరి మేం చెప్పమా! అది కుందేలుబాతు. అవును ఆ బొమ్మలో అవి రెండూ వున్నాయి. ఒక వైపు నుంచి చేస్తే కుందేలు, మరో వైపు నుంచి చూస్తే బాతు కనిపిస్తాయి. మీ స్నేహితులను కూడా అడిగి కాసేపు ఉడికించండి. ఓకేనా!

రంగులు అద్దుదామా!

లక్షాధికారి

రాము వాళ్ల మామయ్యతో కలిసి బజారులో నడుస్తున్నాడు. అక్కడ ఓ వ్యక్తి బండిమీద కొబ్బరిబొండాలు పెట్టి అమ్ముతున్నాడు. ఒకటి ఎంత అని అడిగారు వీళ్లు. ఐదు రూపాయలు అన్నాడా వ్యక్తి. అప్పుడు రాము వాళ్ల మామయ్యతో 'అంకుల్! నేను చెప్పినట్టు చేస్తే నెలరోజుల్లో లక్షాధికారి అయిపోతారు. మీరు రోజుకి ఐదు వందల కొబ్బరి బొండాలను కొనండి. పట్టణంలో ఒక్కో బొండాన్ని మూడు రూపాయల చొప్పున అమ్మండి' అన్నాడు. దానికి వాళ్ల మామయ్య వాడి వంక అదోలా చూసి 'అవును. ఆ పని చేస్తే నిజంగానే నేను లక్షాధికారిని అవుతానం' అన్నాడు. వీళ్లిద్దరి మధ్య జరిగిన సంభాషణను జాగ్రత్తగా చదివి పొర్లిన పొరపాటు ఏంటో కనిపెట్టి. అందుకు కారణం ఏంటో ఊహించి చెప్పండి.

జవాబు

ఐదు రూపాయల బొండాన్ని మూడు రూపాయలకు అమ్మితే నష్టం వస్తుంది. దాంతో అప్పటికే కోటీశ్వరుడైన రాము వాళ్ల మామయ్య నెల రోజుల్లోనే లక్షాధికారి అవుతాడు

ఖాళీ జేబులో ఏముంది?

సోము తన స్నేహితులతో కలిసి నడుస్తున్నాడు. ఈలోగా ఐస్క్రీమ్ బండి వచ్చింది. దాన్ని చూసి భీము ఇలా అన్నాడు. 'ఒరే మన సోముగాడి జేబు నిండా వున్నాయిరా డబ్బులు. కొనిపించమనండి' అన్నాడు ఎగతాళిగా.

ఎందుకంటే సోము బాగా పేదవాడన్నమాట. వాడి పేదరికాన్ని వెక్కిరించడానికే అలా అన్నాడని సోముకు తెలుసు. అప్పుడు సోము తెలివిగా 'నా జేబు నిండా డబ్బులు లేకపోవచ్చుకానీ... చాలా విలువైనది, ప్రాణప్రదమైనది వుంది. అదేంటో చెప్పకో చూద్దాం' అన్నాడు.

వాడి జేబు ఖాళీగా కనిపిస్తోంది. కానీ విలువైనది వుందంటాడు? ఏంటబ్బా' అని మిత్రులంతా ఆలోచనలో పడ్డారు. మరి నేస్తాలు మీరు చెప్పండి. సోము జేబులో ఏముంది?

జవాబు

సోము జేబులో ఏముందంటే... గాలి. అదేక ప్రాణప్రదమైనదీ, విలువైనదీ. అది లేకపోతే మన పదినిముషాలు కూడా బతకలేంకదా.

కుందేలు-కొండముచ్చులు

పంచతంత్ర కథలు

"మాల్యవంతం అనే పర్వతం పక్కనే ఒక తోట వుంది. అందులో బోలెడన్ని పళ్ల చెట్లు వున్నాయి. వేసవి కాలం కావడంతో చెరువులన్నీ ఎండిపోయాయి. అక్కడ నివసించే కొండముచ్చులకు ఓ రోజు బాగా దాహం వేసింది. ఎంత వెతికినా నీరు కనిపించలేదు. కానీ దూరంగా వాటికి ఎండమావులు కనిపించాయి. వాటినే నీటి అలలుగా భావించాయి కొండముచ్చులు. ఎంతో ఉత్సాహంగా నడుచుకుంటూ వెళ్లసాగాయి. కానీ ఎంత దూరం నడిచినా ఎండమావులను చేరలేకపోతున్నాయి. వాటి కాళ్లు బొబ్బలెక్కడంతో ఒక చెట్టుకింద కూర్చుని మాట్లాడుకోసాగాయి. ఆ మాటలు విన్న కుందేలు ఒకటి పొదలోంచి బయటకు వచ్చింది.

'మీరు తెలివితక్కువవారిలా కనిపిస్తున్నారే. ఎండమావులను చూసి నీళ్లనుకుని ఇంత దూరం వచ్చారా! అదిగో ఆ కుడివైపు వెళ్లండి. దగ్గరలోనే మీకు ఓ చెరువు కనిపిస్తుంది. వెళ్లి మీ దాహం తీర్చుకోండి' అని చెప్పింది కుందేలు.

ఆ మాటలకు కొండముచ్చులు కోపం తెచ్చుకున్నాయి. ఓ

కుర్ర కొండముచ్చు 'ఏంటీ కుందేలు తెలివైనదా? మనం తెలివితక్కువవాళ్లమా?' అంటూ ఒక్క దూకు దూకి కుందేలు మెడ పట్టుకుంది. అంతటితో వదలకుండా నేలకేసి బాదింది. పాపం ఆ దెబ్బతో కుందేలు ప్రాణం పోయింది. ఆ తర్వాత కొండముచ్చులు కుందేలు చెప్పిన చెరువు దగ్గరకు వెళ్లి దాహం తీర్చుకుని తమ ఇళ్లకు వెళ్లిపోయాయి.

కనుక మూర్ఖులకు హితవు చెప్పకూడదు. అలా చెప్తే కుందేలులాగా ప్రాణాలు కోల్పోవలసి వస్తుంది" అంటూ కథ ముగించానన్నాడు దీర్ఘముఖుడు (కొంగ). అతడు ఇంకా హంసరాజుతో ఇలా చెప్పాడు.

అప్పుడు పక్షులు నావైపు కోపంగా చూస్తూ మీ గురించి, నా గురించి చాలా అవమానకరంగా మాట్లాడాయి. పైగా ఇలాంటి కథలు తమకూ తెలుసన్నాయి.

మహారాజా! ఈలోగా ఓ పక్షివచ్చి 'మా రాజును పోలిన రాజులేడు. ఆకాశంలో వున్న మేఘాల్ని చూసి భయపడే పిరికివాడు మీ రాజు. వానికి రాజ్యాన్ని పరిపాలించే అర్హత లేదు. కనుక నీ మాటలు కట్టిపెట్టి నీ రాజునీ మంత్రినీ మా రాజుదగ్గర సేవ చేయమని చెప్ప' అంది.

ఆ మాటలు వినగానే నాకు దాన్ని చంపుదామన్నంత కోపం వచ్చింది. ఆ కోపాన్ని నిగ్రహించుకుని 'వున్నది వున్నట్లు చెప్పమన్నారు మీరు. నాకు తోచినది చెప్పిన నన్ను తిట్టడం న్యాయం కాదు. నిజానికి మీ రాజుకు రాజ్యం చేయగల దక్షత వుందా?' అన్నాను.

వెంటనే పక్షులు నామీద పడ్డాయి. రెక్కలతో కొట్టాయి. ఓపిక వున్నంత వరకు వాటిని ఎదిరించాను' అంటూ దీర్ఘముఖుడు ముగించాడు.

ఆ మాటలు విని హంసరాజు ఫక్కున నవ్వాడు. 'తన శక్తిని గ్రహించలేక అహంకారంతో గొప్పవారిని ఢీకొనడానికి ప్రయత్నించేవాడు ఎన్నో ఆపదలకు గురవుతాడు. పూర్వం ఓ పొగరబోతు పావురం తనకంటే బలవంతుడైన డేగను ఢీకొని చనిపోయింది ఆ కథ చెప్తాను విను' అంటూ మొదలెట్టాడు.

భీమునిపట్నం తీరంలో సముద్ర కెరటాలు విరిగి పడుతున్నాయి.

ఓ పక్క పురాతనమైన గాలిమేడగా వ్యవహరించే ఒకప్పటి గవర్నరు బంగళా.. మరో పక్క మత్స్యకారులకు దారి చూపించే లైటుహౌస్.. విశాలమైన సముద్రతీరంలో వరుసగా పేర్చిన కర్ర పడవలు ఉన్నాయి.

అరజాల రాణి తల్లి ఇందిరతో సముద్రతీరానికి వచ్చింది. అమ్మ చిటికన వేలు పట్టుకుని బుడిబుడి అడుగులతో సముద్ర కెరటాల వద్దకు వెళ్లింది.

సముద్రం ప్రశాంతంగా ఉంది.

లైటుహౌస్

పొత్తూరి రాజేంద్రప్రసాద్ వర్మ

విశాఖ జిల్లాలో భీమిలిగా పిలవబడే భీమునిపట్నానికి ప్రత్యేక ప్రాధాన్యత ఉంది. ఒకప్పటి డచ్చివారి పరిపాలనకు నిదర్శనంగా వారి సమాధులు పిరమిడ్‌ల మాదిరిగా కనిపిస్తున్నాయి.

సముద్రపు నీటిలో రాణికి కేరింతలు కొట్టాలని ఉంది.

విశాఖపట్నం పెదవాల్తేరులో ఆశిపాప వీధిలో ఉంటున్న రాణి మొదటిసారి భీమిలి వచ్చింది. తల్లి ఇందిర ఆమెకు భీమిలి అందాలను వివరించింది. సముద్రం నుంచి విడివడి పెద్ద తటాకం మాదిరిగా తయారైన ఉప్పుటేరులో పడవ మీద తిప్పింది. పడవ నీటిని కోసుకుంటూ ముందుకు సాగిపోతుంటే చేతివేళ్లను నీళ్లలో పెట్టి ఆనందాన్ని అనుభవించింది. ఉప్పుటేరు మధ్యలో నున్న పడవ నుంచి దూరంగా కనిపిస్తున్న గంట స్తంభం.. నర్సింహస్వామి గుడి.. పురాతన కట్టడాలు ఒక్కొక్కదాని గురించి తల్లి ఇందిర వివరించింది.

తర్వాత లైటు హౌస్ వద్దకు వచ్చారు.

"రాణీ! ఇది లైటు హౌస్..వందేళ్ల క్రితం కట్టారు!" ఇందిర కుమార్తెకు చూపించింది.

"అంటే?"

''చేపలు పట్టేవారు పడవలలో సముద్రం లోపలికి వెళుతుంటారు... అక్కడ నుంచి ఎటు చూసినా సముద్రమే కనిపిస్తుంది. అటువంటివారు ఈ లైటు ఆధారంగా తీరానికి చేరుతారు.." అంది

''అంటే దారి చూపించే దీపమన్నమాట!"

కూతురు మాటల్లో ఒక లాంటి శ్లేష ఇందిర గమనించలేదు.. అయినా చెప్పుకుపోతోంది -" తుఫాన్‌లు, పెనుగాలులు వచ్చినప్పుడు పడవలు సముద్రంలో గల్లంతు అవుతుంటాయి. అటువంటప్పుడు ఈ లైటుహౌస్‌ను చూసుకుని తీరానికి వస్తారు.."

''అమ్మా! ఈ లైటుహౌస్ ఎలా ఉంటుంది?"

''మువ్వయి అడుగుల ఎత్తులో ఉంది..ఆరు సెకండ్లకు ఒకసారి లైటు ఆరి వెలుగుతుంది.." ఆమె వివరించింది.

మూతపడ్డ రాణి కళ్లల్లో ఒకలాంటి వెలుగు కన్పించింది.

తర్వాత ఇందిర ఆమెను సుభాష్‌రోడ్డు వెంబడి నడిపించుకుని నెహ్రూ స్కూలు వద్దకు తీసుకువచ్చింది. నెహ్రూ స్కూలుకు - సిబిఎం హైస్కూలు మధ్య ఎత్తుగా గతుకుల రోడ్డు ఉంది. ఆ రోడ్డులో మూడే ఇళ్లు ఉన్నాయి. అందులో డాబా ఇంటి ముందు ఇద్దరూ ఆగారు.

''మొత్తం భీమిలి అంతా చుట్టబెట్టేశారా?"

రాణి అన్నయ్య రాజుబాబు అడిగాడు. అతను అక్కడ జూనియర్ కాలేజీలో ఇంటర్మీడియెట్ చదువుతున్నాడు.

"అన్నయ్యా! సముద్రం దగ్గరికి కూడా అమ్మ తీసుకువెళ్లింది!'' రాణి ఉత్సాహంగా చెప్పింది. తర్వాత వాళ్లమ్మ ఆమెను నెమ్మదిగా నడిపించుకుని ఇంటిలోపలికి తీసుకువెళ్లింది.

తాతగారింటిలో రాజబాబు చదువుకుంటుండగా రాణిని తీసుకుని ఇందిర, అక్కడికి మొదటిసారి వచ్చింది. వచ్చినరోజే సముద్రానికి తీసుకువెళ్లమని అంది..

ఆ సాయంత్రం -" అమ్మా! నేను ఇక్కడే అన్నయ్య దగ్గరు ఉండి చదువుతాను!" అంది.

ఇందిర ఏమి మాట్లాడలేదు.

"అన్నయ్య ఒక్కడూ చదవడమే ఇక్కడ ఇబ్బంది.. నిన్ను కూడా ఇక్కడ ఎలా వదిలిపెట్టను?

నీకు ఏమీ కనిపించదు. ఎవరో ఒకరు సాయం ఉంటే తప్ప ఏ పనీ చేసుకోలేవు.. నువ్వు మనింటి దగ్గర వైజాగ్‌లోనే చదువుకుందువు గాని. నాన్న గారితో చెప్పి నిన్ను మంచి స్కూల్లో వేయిస్తాను - అంది.

అయిదేళ్ల రాణికి మొదటిసారి ఏడుపు వచ్చింది.

కన్నీళ్లను మూతపడ్డ కళ్లల్లోనే అదుముకుంది.

ఆ ఇంటిలోనే ఓ పక్క వి.డి.బి. రామచంద్రరాజు కుటుంబం అద్దెకు ఉంటుంది. జయశ్రీ, సుగుణ, రమాదేవిలనే ముగ్గురు ఆడపిల్లలు, ప్రసాదు, మురళి, పద్మశేఖర్ అనే మగపిల్లలు సంతానంగా ఉన్నారు.

వారిలో పెద్దవాడు ప్రసాద్, రాజబాబుతోనే ఇంటర్మీడియెట్ చదువుతున్నాడు. అతను కొత్తగా పత్రికా విలేకరిగా కూడా చిన్న ఉద్యోగాన్ని సంపాదించాడు.

పక్కింటిలో రాణి చదువుకోసం ఆరాటపడుతున్న విషయాన్ని గమనించాడు - ''రాజూ! మీ చెల్లెల్ని భీమిలిలోనే చదివించకూడదూ?... ఈ వాతావరణం బాగా నచ్చినట్లుంది. అంధులకు చదువు చెప్పే ఇద్దరు ముగ్గురు టీచర్లు నాకు తెలుసు - " ప్రసాద్ చెప్పాడు.

''ఈ ఏడాదిలో ఇంటర్ అయిపోతుంది. ఇప్పుడు చెల్లెల్ని ఇక్కడ చదివించడం.. మళ్లీ టీసీ తీసుకుని వెళ్లిపోవడం..

ఇబ్బంది అవుతుంది. చూపులేని వారి కోసం విశాఖలో విస్తృతమైన అవకాశాలున్నాయి. ఏ ఆపరేషన్ చేయించినా ఆమెకు కళ్లు మరి రావు. అందుకే చదువుల సరస్వతిగా తీర్చిదిద్దాలి.. సమాజంలో ఆదర్శవంతంగా తయారు చేయాలి..." అన్నాడు రాజబాబు.

ఆ విధంగా తన కృషి ప్రారంభించాడు.

1983లో జరిగిన ఈ సంఘటన రాణి జీవితంపై ఎంతో ప్రభావాన్ని చూపించింది.

* * *

అరజాల రాణి అంధత్వం నుంచి చూపు రప్పించాలని తల్లిదండ్రులు ఎంతో మంది వైద్యులను సంప్రదించినప్పటికీ ఫలితం కనిపించలేదు.

విశాఖ సమీపంలో ఎండాడ వద్ద సముద్ర తీరంలో ఉన్న అంధ బాలికల పాఠశాలలో రాణిని చేర్పించారు. ఏమీ కనిపించకపోయినా చదువు పట్ల శ్రద్ధ ఆమెను ముందుకు నడిపించింది.

తొమ్మిదవ తరగతి వరకూ అంధ బాలికల ఆశ్రమ పాఠశాలలోనే ఆమె విద్యను అభ్యసించింది. సాధారణ విద్యతో బాటు బ్రెయిలీ లిపిని కూడా నేర్చుకుంది. అందరికన్నా తాను ఉన్నతంగా తయారు కావాలన్న ఏకైక లక్ష్యం ఆమె చదువులో అందరికన్నా ఎక్కువ మార్కులు సంపాదించుకొనేలా చేసింది.

చదువుకొనే సమయంలో రాణికి ఎప్పుడూ సముద్రతీరంలో ఉన్న లైటుహౌస్ గుర్తుకు వచ్చేది. నడి సముద్రంలో దారీతెన్నూ లేని వారికి ఆ లైటుహౌస్ దిక్సూచిగా ఎలా ఉంటుందో కళ్లే లేని తనకు చదువు మాత్రమే లైటుహౌస్‌లా ముందుకు నడిపిస్తుందని ఆమె నమ్మేది.

తొమ్మిదవ తరగతి తర్వాత విశాఖ పాత పోస్టాఫీసు వద్ద నున్న క్వీన్‌మేరీ బాలికోన్నత పాఠశాలలో 10వ తరగతిలో చేరింది. అందరికన్నా ఎక్కువ మార్కులతో పాసై ఎంతో మంది ప్రశంసలను పొందింది. జిల్లా స్థాయి అధికారుల నుంచి మెమెంటోలను అందుకుంటున్నప్పుడు తాను కూడా అటువంటి అధికారిగా మారాలని అనుకొనేది.

ఆ తర్వాత ఇంటరు, డిగ్రీ పూర్తి చేసింది.

బి.ఇడి కోర్సులో సీటు లభించింది.

విజయనగరంలో చదవవలసి రావడంతో రాణి మకాం మళ్లీ భీమిలికి మారింది.

నెహ్రూ స్కూలు దగ్గరున్న ఇంటిలో ఆమె మేనమామ మేరుగ హరనాథ్ వద్ద ఉండి రోజూ బస్సులో విజయనగరం వెళ్లి వచ్చేది. శిక్షణ పూర్తయితే ఉపాధ్యాయినిగా ఉద్యోగం లభిస్తుందని ఎంతో ఆశించింది.

భీమిలిలో ఉన్నంతకాలం సముద్రతీరంలో దారిచూపే లైటుహౌస్ ఆమె మదిలో మెదిలేది. తన చదువు ఉపాధ్యాయిని ఉద్యోగం చూపిస్తుందని అనుకొనేది.

అయితే పరిస్థితి మరోలా మారింది.

బిఇడి కోర్సు సమయంలో తాను రాసిన గ్రూప్ 4 పరీక్షా ఫలితాలు వచ్చి శిక్షణ పూర్తయిన తర్వాత వాణిజ్యపన్నుల కార్యాలయంలో జూనియర్ అసిస్టెంటుగా ఉద్యోగం లభించింది. రాణికి ఆ ఉద్యోగం చేయాలని అనిపించలేదు. కాని వాళ్లన్నయ్య రాజబాబు- "ముందు ఏదో ఉపాధి ఉంటే ఆశయాన్ని సాధించవచ్చునని - " ప్రోత్సహించాడు.

ఉద్యోగంలో చేరింది.

తర్వాత పట్టుదలతో కృషి సాగించింది.

సన్మానాన్ని అందుకున్న డిప్యూటీ లేబర్ కమిషనర్ రాణి

సర్వీసు కమిషన్ నిర్వహించిన గ్రూప్ వన్ పరీక్షల్లో ఉత్తీర్ణురాలైంది. ఆమె కోరిక మేరకు కార్మికశాఖలో సహాయ కమిషనర్‌గా ఉద్యోగం లభించింది.

పత్రికల్లో వచ్చిన ఆ సంగతి తెలుసుకుని ఆమె పులకరించి పోయింది. మనసు ఆనందంతో ఉర్రూతలు ఊగింది. తల్లి ఇందిర, అన్నయ్య రాజబాబు ఎంతో సంతోషించారు.

జూన్ 30, 2004 గురువారం

విశాఖపట్నం లయన్స్‌క్లబ్ కమ్యూనిటీ హాలు..

రాష్ట్రం మొత్తం మీద సర్వీసు కమీషన్ పరీక్షలో ఎంపికైన అంధ విద్యార్థిని రాణికి సన్మాన కార్యక్రమం ఏర్పాటైంది. లయన్సు క్లబ్ ప్రతినిధులంతా హాజరయ్యారు.

ఈ కార్యక్రమానికి ఎండాడ అంధ బాలికల పాఠశాలలో చదువుతున్న ఇతర అంధ బాలికలు కూడా హాజరయ్యారు. శాలువా కప్పి సత్కరించి మెమెంటోను బహూకరించారు. వక్తలందరూ రాణి కృషిని, పట్టుదలను కార్యశీలతతో సాధించిన ఉద్యోగ విజయాలను అభినందించారు. ఆమెతో చదువుకున్న కొంతమంది సహ విద్యార్థినులు చిన్నతనం నుంచి రాణి వ్యక్తిత్వం ఏ విధంగా ఉండేదో.. ఆమె ఎలా ప్రవర్తించేదో చెప్పారు. మరికొంత మంది ఆమెతో తమకున్న పరిచయం, అనుభవాలను తెలియజేశారు.

రాణి తల్లిదండ్రులను, అన్నయ్య రాజబాబు కృషిని కూడా మరికొంతమంది మెచ్చుకున్నారు.

తర్వాత మాట్లాడమని రాణిని ఆహ్వానించారు.

రాణి వేదికపైకి వచ్చింది.

మైకు అందుకుని నెమ్మదిగా మొదలైన ఆమె ప్రసంగం ప్రవాహంలా కొనసాగంది - "మనిషి జీవితంలో కళ్ళకు ఎంతో ప్రాధాన్యం ఉంది. ఈ అవయవాలు మనిషికి ఉంటే లోకాన్ని చూడవచ్చు. ఏదైనా తెలుసుకోవచ్చు..." అంది.

తర్వాత- "నేను సాధించిన విషయం చాలా చిన్నది.. మన ఆశయం మహోన్నతంగా ఉండాలి. ఆశయ సాధన కోసం చిత్తశుద్ధితో కృషి చేయాలి. ఊహ తెలిసిన తర్వాత కళ్లు లేని లోపం ఎంతో బాధించింది. దానిని అధిగమించడానికి ఏదైనా సాధించాలని అనుకున్నాను. ప్రాణాపాయంలో ఉన్నవారికి, సముద్రంలో తుఫానులో చిక్కుకున్నవారికి దారి చూపడానికి సముద్రతీరంలో లైటుహౌస్ ఉంటుందని తెలుసుకున్నాను. అప్పటి నుంచి దారిచూపే ఆ దీపం స్తంభం నా మనసుపైన గాఢమైన ప్రభావం చూపించింది. లోకమంటే ఏమిటో తెలియని నా జీవితానికి అర్థం, పరమార్థం చదువేనని అనుకున్నాను. నాకు చదువు ఉంటే అది ఒక దీపం మాదిరిగా నా జీవితాన్ని నడిపిస్తుందని అనుకున్నాను. అందుకు అనుగుణంగానే కృషి చేశాను. నా జీవిత నావకు నా చదువే దారిచూపే లైట్‌హౌస్‌గా మారి ఈ స్థాయికి తీసుకుని వచ్చింది. నా కృషిలో నా కుటుంబ సభ్యులు, స్నేహితులు ఎంతగానో సహకరించారు..." రాణి మాటలు ఆపింది. ఏదో తెలియని ఆవేదన ఆమె గొంతులో సుడులు తిరిగింది. నోటిలో మాట మెలిపడింది. మరి మాట్లాడలేకపోయింది.

ప్రేక్షకులు చప్పట్లు కొట్టి అభినందించారు.

"నా లాంటి ఎంతోమంది ఈ లోకంలో ఉన్నారు. కొందరికి అవకాశాలు లభిస్తున్నాయి. మరి కొందరికి ఎటువంటి సహకారం అందడం లేదు. వివిధ రకాల అంగవైకల్యాల సుడిగుండాల్లోనూ, సమస్యల సముద్రాల్లోనూ దిక్కుతోచని స్థితిలో ఉన్నవారికి చుక్కాని మాదిరిగా, లైటుహౌస్‌ల మాదిరిగా మీరంతా దారి చూపాలి.. అదే నేను కోరుకున్నది...." రాణి కళ్లల్లో కన్నీళ్లు ఉబికాయి. ◆

ఆదర్శ భర్తలు...

లక్ష్మి

ఇద్దరూ ఇద్దరే! చెప్పుకోదగ్గ మొనగాళ్ళు!

తమ అర్ధాంగుల ముందు ఎంతో అణకువగా ఉంటారు. ఆదర్శ భర్తలుగా బిరుదు సంపాయిస్తారు!

పరోక్షంలో మాత్రం–అందుకు విరుద్ధంగా చెలరేగిపోతుంటారు. పిచ్చి పిచ్చి ప్లాన్లతో..కుట్రలతో అర్ధాంగుల అమాయకత్వంతో ఆడుకుంటూ వుంటారు!

ఆ ధ్యేయంతో అలసిపోతూ వుంటారు!

కేవలం ఆ యిద్దరే కాదు. అల్లాంటి మగవాళ్ళు భూలోకంలో అసంఖ్యాకంగా వున్నారు!

ప్రస్తుతానికి ఆ యిద్దరి మొనగాళ్ళ సంభాషణ చిత్తగించండి!

"నా పేరు రామకృష్ణ"

"బావుంది నాకిష్టమైన పేరు"

"తమ గురించి విన్నానండీ బాబాయిగారూ! "

"వినేవుంటావు. లేకపోతే ఎందుకు వస్తావు?"

"మగమారాజుల సంఘానికి తమరు చేస్తున్న సేవ అమోఘం!"

"అదంతా నీ అభిమానం"

"తమకి మగలోకం యావత్తు ఋణపడివుంటుంది."

"సంతోషం!"

"పురుషుడు ఆడమనిషి చేతిలో ఆటబొమ్మ అని మీరన్నారండి!"

"పురుషుడు బదులు 'మగాడు' అను. బావుంటుంది."

"నేనేమన్నా – మీరన్నది మాత్రం – వేదవాక్కంటాను"

"అంతే! నేనెప్పుడూ అంతే! ఏమన్నా – వేదం టైపులోనే అంటాను! అలనాడు సత్యభామ ఏం చేసింది?"

"పేరేమిటన్నారు?"

"సత్యభామ"

"సత్యభామ ఎవరండీ?"

"కృష్ణమూర్తి భార్య! లార్డ్ కృష్ణాస్ వైఫ్!"

"ఓహో! ఆవిడా?"

"ఆహా! ఆవిడే! మహాతల్లి ఏం చేసింది?"

"ఏం చేసిందండీ?"

"మొగుడి మొహమ్మీద కాల్తో తన్నింది!"

"అవునండోయ్! ఆ మాటే మరిచిపోయేను!"

"అలాంటి మాటరు మరిచిపోడం మగాడి లక్షణం! వదిలేయ్! అప్పుడు ఆ పరమాత్మ నోరెత్తేడా? ఉహూ! పైగా – సదరు భార్యామణి పాదాలొత్తేడు! నీ లేత పాదాలకు దెబ్బతగిలిందా సత్యా అని అడిగేడు! దీనివల్ల నీకేం అర్థమవుతోంది!."

"సింపులండి"

"అదే! ఆ సింపులే చెప్పమంటున్నాను!"

"మొగుడ్ని పెళ్ళాం కాల్తో కొట్టినపుడు – ఆ యొక్క మొగుడు ఆ యొక్క పెళ్ళాం పాదాలొత్తవలెను అని అర్థమవుతోందండి! అయ్యా! ఇప్పుడు నేను కూడా మా ఆవిడ్తో కాలిదెబ్బ తినేలాగా వున్నానండి!"

"సిగ్గుపడకు! భయపడకు! మగాడై పుట్టిం తర్వాత ఇల్లాంటి ఈతి బాధలు తప్పవు! అసలేం జరిగిందో చెప్పు!"

"మా ఆవిడ నా మీద సిఐడిలను పెట్టిందండి!"

ఆ మాటకు బాబాయ్‌గారు గొప్ప షాకు తిన్నారు, షాకులోనే అడిగేరు–

"ఏమిటేమిటీ? మీ ఆవిడ నీ మీద సిఐడిలను పెట్టిందా?"

"అవున్సార్! దాదాపు సిఐడిలే. పూలు పళ్ళూ అమ్ముకునే వాళ్ళూ, రిక్షావాళ్ళూ – ముష్టెత్తుకునే వాళ్ళూ – వీళ్ళంతా నా పాలిట సిఐడీలండి! మొన్నేమైందో తెలుసాండి?"

"ఉహూ తెలీదు"

"గోల్డెన్‌కేఫ్‌లో కాఫీ తాగి బయటకొచ్చేనండి. ఒక ముష్టి వెధవ అడుక్కునే డ్యూటీ మానేసి నన్ను ఫాలో అవుతున్నట్టు గమనించేనండి. వాడెవడో మా ఆవిడ పెట్టిన ఏజెంటని భ్రమపడి – ఎందుకైనా మంచిదని – వాడి చేతిలో పాతిక రూపాయలు పెట్టానండి! వాడు ఆ డబ్బు తీసుకుని ఆనందంగా పద్యాలు పాడుకుంటుంటే – మా ఆవిడ పెట్టిన అసలు ముష్టి ఏజెంటు వచ్చి – ఆ డబ్బు వాడికి చెందాలని గొడవపెట్టుకున్నాడండి. ఆ గొడవ ఇద్దరి ముష్టివాళ్ళ మధ్య ముష్టి యుద్ధానికి దారితీసిందండి! ఏమడుగుతార్లేండి – నా బతుకుతో పాటు ముష్టి వాళ్ళ బతుకుల్ని కూడా అయోమయం చేస్తోంది మా ఆవిడ!"

"రామకృష్ణా..." అంటూ నసిగేడు బాబాయ్‌గారు

"బాబాయ్‌గారూ" అన్నాడు రామకృష్ణ

"అడక్కూడదు గానీ..."

"అమ్మో! అంత మాటనకండి బాబాయ్‌గారూ! తమరడగాలి! నేను చెప్పాలి! అప్పుడే నా సమస్యకి కరెక్టు పరిష్కారం దొరుకుతుంది!"

"నువ్వు కూడా లార్డ్ కృష్ణా టైపేనా!"

"నా బ్రెయిన్ ట్యూబ్‌లైట్ సార్! చప్పున వెలగదు."

"అదేనయ్యా! బృందావనం... గోపికలు...."

"అమ్మో! తల్లి తోడు సార్! నేను అల్లాంటి మనిషిని కాను!'

"అలాంటప్పుడు నీ భార్య నీ మీద సిఐడిలను ఎందుకు పెట్టింది.?"

రామకృష్ణ భారంగా నిట్టూర్చేడు. తాపీగా సమాధానం చెప్పేడు–

"నా పెళ్ళికాక ముందు – నేనొక అమ్మాయిని ప్రేమించేనండి!"

"నువ్వే కాదు రామకృష్ణా! ఆ సీజన్లో – నూటికి తొంభైమంది ఆ పని మీదే వుంటారు."

(మిగతా వచ్చే సంచికలో)

◆

గాల్లో తేలిపోతూ... గుర్రంలా సకిలిస్తూ... మహాసంబరంగా... ఆనందంగా వీరాస్వామి రావిచెట్టు చప్టా దగ్గరకు వచ్చి పడ్డాడు. లోకాభిరామాయణం మాట్లాడుకుంటున్న జక్కులోడు, యాద్గిరి వాడివంక విచిత్రంగా చూశారు. వాడు చేతులు కాళ్ళు నిగడదన్ని చప్టామీద చక్రవర్తిలా పీఠం వేశాడు. వాడి ముసిముసి నవ్వుల సంబరం చూసి యాద్గిరికి అనుమానం వచ్చింది. వాడి సంబరానికి కారణం ఎంత సోంచాయించినా సమఝ్ కాలేదు. మరీ చిత్రంగా వాడు బనీను జోబిలో నుండి ఖరీదైన పొడుగు సిగరెట్ తీసి వెలిగించడంతో జక్కులోడి దమాక్ గిర్రున తిరిగి మూర్ఛవచ్చినంత పనయ్యింది.



మౌనమేలనోయి...

"ఏందిరా కతా.... సంగతేంది? మహాజోరు చేస్తున్నవ్?" యాద్గిరి బీడీ అంటించి అన్నాడు. వాడు వంకర్లు తిరిగి యమా సిగ్గుపడిపోయాడు.

"అన్నా గివాళ మీకు దావతియ్యాలనుకుంటున్న! ఏం దావతు కావాల్నె... మందుపోయించనా... బిర్యానీ ఇప్పిచ్చనా... ఏం కావాల్నో చెప్పవే...?"

జక్కులోడు వాడి బుర్రవంక వెర్రిగా చూశాడు. పొద్దున్నే వీడు ఓ అరసీసా గుడుంబా పీకయినా వుండాలె.. పిచ్చో వెర్రో ముదిరైనా వుండాలె - ఏమో... చాతబడి కావచ్చు.. ఏ దెయ్యమో... సైతానుగిన పట్టిందేమో వాడు లపలప చంకలు చరుచుకుని లేచి యాద్గిరి చేయందుకుని లేపబోయాడు. యాద్గిరి ఓ కసురు కసిరాడు.

"అరె.. ఏందిర... పొద్దుగాల్నె తిక్క తిక్క చేస్తున్నవ్! ఏమైందిరా నీకు.." అని నాలుగు గదుములు గదివేటప్పటికి వాడి వుర్రడి తగ్గి కాస్తంత సమ్మాలించుకున్నాడు.

"అరె... నీ సంబరం ఎందుకో జర చెప్పరాదుర!" జక్కులోడు గద్దించి అడిగాడు. వాడు మాత్రం జీకురు కండలా పట్టుకుని హోటల్‌కు తీస్కపోయిండు. కోడి బిర్యానీ తెప్పిచ్చిండు. వాడొక్కడే ఆబగా చిన్న బ్రాంది సీసా తెచ్చుకుని తాగిండు. బయటపడి చప్టామీదకు చేరుకున్నంక యాద్గిరి వాడ్ని కొట్టినంత పని చేసిండు.

"బిర్యానీ తినిపిచ్చినవ్... దోస్తువుగద... సరే... మరింగ ఇపుడు అసలు సంగతేందో చెప్పు!" అని గదిరించిండు.

"అన్నా... నా పెండ్లాం... గదే చెంద్రమ్మ నిన్నట్నుంచి మాటలు బందు చేసింది..." చంకలు గుద్దుకున్నాడు.

"ఏందిర... మాటగిన పడిపోయిందిరా!.. దవాకానాకు తోలకపోకుండా నువు ఖుషీలు చేస్తున్నావ్‌ర! చెంద్రమ్మకు మాటపడిపోతే - చెడబడి తిరిగి అందరికి బిర్యానీలు తినిపిస్తావ్ !" జక్కులోడు గజం ఎత్తు ఎగిరాడు.

"ఏం జబ్బురా... పచ్చకామెర్లా... ధనుర్వాతమా?"

"అబ్బే.. అబ్బే... అదేం లేదన్నా.. దాసంతటికదే మూడుపూట్లా సుబ్బడంగా తింటంది.. తిరుగుతంది.. వంటలు చేస్తుంది. అప్పుడపుడు నా మీద గుడ్లురుముతుంది. మాటమాత్రం బంద్. హమ్మ... నేనేదైనా అడిగితే రెండు చేతుల్తో ఓ దండం పెట్టి తన పన్లు తాను చేసకపోతంది. వామ్మో - ఇంగ నా చెవుల్లో దూదుండలు పెట్టుకునే దెబ్బ తప్పిపోయింది. నాకిపుడెంత ఖుషీగా నిదర పడుతుందో... దేవుడా... అంతా నీ దయ..

జక్కులోడికంతా అయోమయంగా వుంది. ఎందుకంటే చంద్రమ్మ వీరాస్వాముల ఇల్లు జక్కులోడి ఇంటి పక్కనే. చెంద్రమ్మది అదో తత్వం. పండుకున్నపుడు తప్ప మిగిలిన టైమంతా ఏదో ఒకటి వాగుతూనే వుంటుంది. మొగుడ్ని దబాయిస్తూనే వుంటుంది. చెంద్రమ్మకి యాడ్నుంచి పుట్టుకొచ్చిందో ఆ తెలివి. తోటకూర మీదా.. మురిక్కాలవల మీదా... పంటపొలాలు.. చెమటపొక్కులు... ప్రైమరీ పాఠశాలలు... అట్లా మీట నొక్కితే పంపునుండి లొడలొడ నీళ్ళు వచ్చినట్లు ఒకటే వాగుడు. మొగుడ్ని మాత్రం "ఏం తిక్కగా వుందా.. ఒళ్ళు దగ్గర పెట్టుకుని పని చెయ్... ఎన్నిసార్లు చెప్పాలె!" అని నిలదీసి దబాయిస్తుంది. దాని వాగుడు భరించలేక ఆ మధ్యన ఊర్లోకి ఎవరో స్వాముల వారు వస్తే వీరాస్వామి వారిని తీసుకుని వారి పాదాలందుకుని పరిష్కారం కోసం ప్రార్థించాడు. ఆయనగారు చిద్విలాసంగా నవ్వి-గెడ్డం గీక్కుని జోలెలో నుండి దూదితో తయారు చేసిన రెండు వుండలు చేతిలో పెట్టి ఇరవై రూపాయలు వసూలు చేశాడు. వీరాస్వామి తిక్క శంకరయ్యలా ఆయన గెడ్డం వంక వెర్రి వెధవలా చూశాడు. ఆయన జమదగ్నిలా నవ్వి 'నాయనా ఇవి భగవత్ ప్రసాదం... అర్జంటుగా వీటిని నీ రెండు కర్ణములలో ఇరికించుకొనుము. ఈ కలుషిత శబ్దకాలుష్య ప్రపంచం నుండి నీకు విముక్తిని ప్రసాదించగలవు. మనోనిబ్బరాన్నిచ్చి నీ ఆయుష్షను పెంచి చెంద్రమ్మ దెబ్బ నుండి కాపాడగలవు. జై జమదగ్నీ" అని వారు సందుగొందుల్లో దూరి అదృశ్యమయ్యాడు.

మరి ఇపుడు హఠాత్తుగా చెంద్రమ్మలో ఈ మార్పు కలగడానికి కారణం ?

యాద్గిరి, జక్కులోడు ఎంత సోంచాయించినా జవాబు దొరకలేదు.

* * *

మర్నాడు అదే టయానికి వీరాస్వామి ఏడుపు మొహంతో కళ్ళనీళ్ళతో మొహమంతా వుబ్బిపోయి చిందరవందరగా తూలుకుంటూ చప్టా దగ్గరకు వచ్చాడు.

"ఏమయిందిరా? బుర్రకాయంతా అట్లా వాచిపోయిందేంరా? కావెర్లు గాని తగిల్నయా... అంత లావున తాగినవ్!"

"కాదెషె... ఆ ఒక్కరోజే మౌనవ్రతమట! ఇవాళ మల్లా ఎగబడి వాగుడుకు తగులుకుంది. నేను బయట బజార్లోకి వురక్కుండా తలుపులకు తాళాలు వేసి బందోబస్తు చేసింది. తలంతా వాచిపోయింది" వీరాస్వామి ఏడుస్తూ చెప్పాడు.

"బాగుందిర... మన అసెంబ్లీలోనూ మొన్న ఇదే యవ్వారం - జిమ్మిక్కు. ఏం చేస్తాం! జనాలు గమనిస్తూనే వున్నారు" యాద్గిరి సాలోచనగా అన్నాడు.

◆

శరీరానికి రంగునిచ్చే మెలనోసైటు కణాలు సంఖ్యలో తగ్గినా లేక అసలు లేకుండా పోయినా ఏర్పడే తెల్ల, రంగులేని మచ్చలు లేక రంగు తగ్గిన మచ్చలుంటే దానిని విటిలిగో లేక తెల్లమచ్చలు అంటారు. అయితే తెలిసిన కారణాల వల్ల కలిగిన తెల్లమచ్చల్ని ఉదా : కాలడం వల్ల లేక రసాయనాలైన ఫినాల్స్ లేక కాథెకోల్స్‌తో స్పర్శ వల్ల లేదా చర్మ వ్యాధి వల్ల కలిగిన తెల్లమచ్చలను లేక రంగుకోల్పోవడాన్ని డీపింగ్మెంటేషన్ ల్యూకోడెర్మా అంటారు.



తెల్లమచ్చలు ప్రమాదకరం కాదు



డాక్టర్ నాగినేని భాస్కరరావు,
హైదరాబాద్

తెల్లమచ్చలు లేక విటిలిగో : జనాభాలో 1-2 శాతం ప్రజలకు ఉంటుంటాయి. పిల్లల్లోనూ, వృద్ధుల్లోనూ సాధారణంగా రాదు. 20-40 సంవత్సరాల మధ్య వయసున్న వారికి వస్తుంది. ఆడ, మగవారిలో ఇది వస్తుంది. ఈ తెల్లమచ్చలున్న వారిలో మధుమేహం, థైరాయిడ్ గ్రంధి సరిగ్గా పని చేయకపోవడం, బట్టతల, అడిసన్స్ జబ్బు, లిచెన్ ప్లానస్ మొదలగు జబ్బులు ఎక్కువగా వచ్చే అవకాశం ఉంది. విటిలిగో-మెలనోసైటులకు వ్యతిరేకంగా నిర్దేశింపబడిన ఒక ఆటో ఇమ్యూన్ డిసీజ్ - పాలవంటి తెలుపు లేక మామూలు చర్మం కంటే రంగు తగ్గిన మచ్చలు, పక్కన మామూలు చర్మంతో పోల్చినప్పుడు చక్కగా వేరుపడి కనిపిస్తాయి. ఈ మచ్చలపై స్పర్శజ్ఞానం వుంటుంది. అయితే ఈ మచ్చలు కుష్టువ్యాధిలో వచ్చే మచ్చలతో పోల్చినప్పుడు కుష్టువ్యాధిలో స్పర్శలేని లేక స్పర్శ తగ్గిన మచ్చలుంటాయి.

తెల్లమచ్చలున్న ప్రదేశాన్ని బట్టి వాటిని ఈ కింది విధంగా విభజింపవచ్చు :

1. లోకలైజ్డ్ శరీరంలో ఒక ప్రాంతానికే కొన్ని తెల్లమచ్చలుండటం.
2. డెర్మాటోమల్ ఒకటి లేక రెండు నరములు నరఫరా అయ్యే చర్మ ప్రాంతాలలో తెల్లమచ్చలుండటం.
3. ఉల్గారిస్ - కాళ్ళ ముందు భాగం ముంజేతులు, అరచేతులు, పాదాలు, మోకాళ్ళు, పెదాలు, కంటిరెప్పలు, శరీర పై భాగం, మర్మావయవాలు, చంకలు, గజ్జల్లో విస్తృతంగా మచ్చలుండటం.
4. ఆక్రో-ఒరిఫీషియల్ చేతివేళ్ళు, పాదం వేళ్ళు, అరచేతులు, పాదాలు, పెదాల చుట్టూ, నోటిచుట్టూ, కంటిచుట్టూ, శిశ్నం ముందు భాగంపై తెల్లమచ్చలుండటం.
5. యూనివర్సల్ : దాదాపు శరీరం అంతా తెల్లమచ్చలుండటం.

అయితే ఈ తెల్లమచ్చలు - అందం దృష్టిలో తప్ప ప్రమాదకరమైనవి కావు. సిగ్గుపడవలసిన పనిలేదు.

చికిత్స : 1) తక్కువ సమయంలో వచ్చిన ఒంటరి మచ్చలకు ఫ్లోసినోలోన్ ఎసిటోనైడ్ అనే పూతమందు, 2) నోటి ద్వారా కార్టికోస్టీరాయిడ్ మందులు ఇస్తే అభివృద్ధి చెందుతున్న మచ్చలను నివారించవచ్చు. 3) శరీరంలో 20 శాతం కన్నా ఎక్కువ భాగం తెల్లమచ్చలకు గురైతే పూవా థెరపి అనగా సోరోలెన్ + అల్ట్రా వైలెట్ - ఏ చికిత్స ఇవ్వాలి. ◆



ఆడపిల్ల

(9వ పేజీ తరువాయి)

పెరగటంతో ప్రసూతి హాలుకు తీసుకెళ్ళడానికి సిద్ధం చేస్తున్నారు నర్సులు.

శ్రీధర్ కూడా సమయానికి చేరుకున్నాడు కాని లక్ష్మిని పలుకరించలేదు

శ్రీలక్ష్మి కంటనీరుపెట్టింది "ఏడవకమ్మా, ధైర్యంగా ఉండు. అంతా మంచే జరుగుతుంది" అంటూ తల్లి ఓదార్చింది.

"నీకేం కాదు చెల్లెమ్మా! మేమంతాలేమూ, మహాలక్ష్మి లాంటి బిడ్డ పుడుతుంది" అంటూ ధైర్యం చెప్పాడు లక్ష్మయ్య.

ఆ మాటలే శ్రీలక్ష్మికి కొండంత ధైర్యాన్నిచ్చాయి.

శ్రీలక్ష్మిని ప్రసూతి గదిలోకి తీసుకెళ్ళారు.

గంట తర్వాత సిస్టర్ నర్సమ్మ బయటకు వచ్చి "శ్రీలక్ష్మికి మగ పిల్లాడు పుట్టాడని" చెప్పింది.

తన కోరిక నెరవేరిందని ఆనందపడ్డాడు శ్రీధర్.

అందరూ లోనకెళ్ళి పుట్టిన బిడ్డను చూస్తున్నారు.

"అంతా మా నాన్న పోలికే" అన్నాడు శ్రీధర్.

"కొడుకు పుట్టాలన్న నీ కోరిక నెరవేరింది బావా" అన్నాడు లక్ష్మయ్య. శ్రీలక్ష్మి ఇంకా స్పృహలోకి రాలేదు.

"చూడటం అయిపోయిందిగా పదండి" అంటూ అందరినీ బయటికి తీసుకొచ్చింది సిస్టర్.

శ్రీలక్ష్మి స్పృహలోకి వచ్చిన విషయం తెలుసుకొని ఆమె ఆరోగ్యాన్ని పరీక్షిస్తున్నాడు డాక్టర్ దేవానందం.

సిస్టర్ నర్సమ్మ బిడ్డను తల్లికి చూపుతుండగా "నీకు మగబిడ్డ జన్మించాడమ్మా" అని చెప్పి వెళ్ళాడు డాక్టర్.

'మగపిల్లాడు' పుట్టాడనగానే శ్రీలక్ష్మి నిర్ఘాంత పోయింది.

"నో... అబద్ధం! నాకు పుట్టేది ఆడపిల్లకదా! మగబిడ్డను ఎలా చూపుతున్నారు?... వీల్లేదు ఇక్కడేదో మోసం జరిగింది... నన్ను మోసం చేశారు, ఈ బిడ్డ నాకు పుట్టలేదు... నాకు పుట్టిన బిడ్డను ఏం చేశారు? నా బిడ్డ నాకు కావాలి" అంటూ అరిచి కేకలు పెడుతూ నెత్తీనోరు బాదుకుంటోంది శ్రీలక్ష్మి.

పరిస్థితిని గమనించి వెంటనే శ్రీలక్ష్మికి మత్తుసూది ఇచ్చింది సిస్టర్. శ్రీలక్ష్మి మెల్లగా తిరిగి మత్తులోకి జారుకుంది.

సిస్టర్ డాక్టర్ వద్దకెళ్ళి శ్రీలక్ష్మి చేసిన గొడవ గురించి తెలిపింది ఆందోళన పడుతూ.

"ఆమెకు ఆడపిల్ల పుట్టిన సంగతి ఎలా తెలుసు?" ఆశ్చర్యపోతూ అన్నాడు డాక్టర్.

"ఏమో డాక్టర్ అదే నాకు అర్థం కావడంలేదు.. నాకెందుకో భయంగా ఉంది సార్" అన్నది సిస్టర్ నర్సమ్మ.

నువ్వేమీ భయపడకు. అవన్నీ నేను చూసుకుంటాగా... ఆమె భర్త శ్రీధర్‌ను నా గదికి పంపించు" అని చెప్పాడు డాక్టర్.

సిస్టర్ బయటకు వచ్చి, 'మిమ్మల్ని డాక్టర్‌గారు పిలుస్తున్నారని' శ్రీధర్‌కు చెప్పి పంపించింది.

వెంటనే శ్రీధర్ వెళ్ళి డాక్టర్ దేవానందంను కలిశాడు.

"మిస్టర్ శ్రీధర్! నీ భార్య తనకు ఆడబిడ్డ పుట్టిందని గోల చేస్తోంది, ఈ విషయం ఆమెకు ఎలా తెలిసుంటుంది?... ఆఁ అన్నట్లు అంత క్రితం ఎప్పుడయినా స్కానింగ్ తీయించారా?... నిజం చెప్పు. లేకుంటే పెద్ద గొడవయి పోతుంది ఈ విషయం" అంటూ శ్రీధర్‌ని నిలదీశాడు డాక్టర్.

తనేదో దొంగయినట్లుగా సిగ్గుతో తలొంచుకున్నాడు శ్రీధర్.

"కాన్పు సమయంలో తల్లికి ఆడపిల్ల పుట్టిన సంగతి తెలియదు. కచ్చితంగా స్కానింగ్ తీయించి ఉంటారు మీరు. అవునా.. నిజం చెప్పండి" అని మళ్ళీ నిలదీసి అడిగాడు డాక్టర్.

నిజం చెప్పకపోతే డాక్టర్ ఊరుకోడని జరిగిన వాస్తవం చెప్పాలనుకున్నాడు శ్రీధర్ మనసులో "నిజమే డాక్టర్ స్కానింగ్ తీయించాకనే ఆడపిల్ల పుడుతుందని తెలిసి మిమ్మల్ని కలిసి ఈ ఏర్పాట్లు చేసుకున్నాను.. ఈ విషయం ముందే మీకు చెప్పకపోవటం నాది తప్పేసార్'' అన్నాడు సిగ్గుపడుతూ.

"ఇప్పుడు తప్పంటే ఎలాగయ్యా!.. నీ భార్య చేస్తున్న గొడవవల్ల ఏం జరుగుతుందో ఏమో!... పెద్ద చిక్కొచ్చి పడింది. ఇప్పుడు ఏం చెయ్యాలి?" చికాకు పడుతూ డాక్టర్ కోపాన్ని ప్రదర్శించాడు.

"ఈ సమస్య అల్లరి కాకుండా ఎలాగైనాసరే మీరే పరిష్కరించాలి, ఈ విషయం నల్గురి నోళ్ళలో పడకుండా ఆపు చేయాలి. అందుకయ్యే ఖర్చులే ఇవిగో మరో పదివేలు" అంటూ జేబులో నుండి నోట్లకట్ట తీసి డాక్టర్‌కు అందించాడు దీనంగా.

మనసులో సంతోషపడుతూనే పైకి విసుగు నటిస్తూ "ఈ సమస్యను కూడా నాకే ముడిపెట్టావా!" అంటూ డబ్బులు తీసుకుంటూ "సరే తప్పుతుందా మంత్రసాని పనికి ఒప్పుకున్నాక తప్పుతుందా" అని సరే హాస్పిటల్ తరపున వచ్చే గొడవలు, సమస్యలు నేను చేసుకుంటాను. నీ భార్య మాత్రం గొడవచెయ్యకుండా నువ్వే చూసుకోవాలి" అంటూ జాగ్రత్తలు చెప్పి శ్రీధర్‌ని గదిలో నుండి పంపించాడు డాక్టర్.

శ్రీలక్ష్మి గదికి వచ్చాడు శ్రీధర్. ఆమె ఇంకా స్పృహలోకి రాలేదని గమనించాడు. శ్రీధర్ బంధువులు, స్నేహితులు వచ్చి తల్లీ బిడ్డను చూసి పోతున్నారు.

శ్రీధర్ మరోసారి తృప్తిగా కొడుకును చూసుకొని బయటకు వచ్చి ఆలోచించుకుంటూ కూర్చున్నాడు.

తన భార్యకు ఆడపిల్ల పుడుతుందని తెలుసుకున్న శ్రీధర్ ఎలాగైనాసరే ఆ పసికందును మగబిడ్డగా మార్చాలని నిశ్చయించుకున్నాడు. ఆడపిల్లయితె చదివించాలి. కట్నాలు ఇవ్వాలి. ఎప్పుడూ

తన భార్యకు ఆడపిల్ల పుడుతుందని తెలుసుకున్న శ్రీధర్ ఎలాగైనాసరే ఆ పసికందును మగబిడ్డగా మార్చాలని నిశ్చయించుకున్నాడు. ఆడపిల్లయితె చదివించాలి. కట్నాలు ఇవ్వాలి. ఎప్పుడూ ఏదో పెట్టుబోతలు పెట్టాల్సి వస్తుంది. ఖర్చులు సమస్యలు అనేకం ఉంటాయి. లక్షలకు లక్షలు కట్నకానుకలుగా ఇవ్వాలి. పెంచి పెళ్ళిచేసేదాకా కాపలా సమస్యలు ఎన్నో ఉంటాయి. పైగా వంశాన్ని నిలబెట్టేది మగ పిల్లాడేనని తీవ్రంగా ఆలోచించాడు శ్రీధర్.

ఏదో పెట్టుబోతలు పెట్టాల్సి వస్తుంది. ఖర్చులు సమస్యలు అనేకం ఉంటాయి. లక్షలకు లక్షలు కట్నకానుకలుగా ఇవ్వాలి. పెంచి పెళ్ళిచేసేదాకా కాపలా సమస్యలు ఎన్నో ఉంటాయి. పైగా వంశాన్ని నిలబెట్టేది మగ పిల్లాడేనని తీవ్రంగా ఆలోచించాడు శ్రీధర్.

శ్రీలక్ష్మి ఇంకో నెలరోజుల్లో పుట్టింటికి వెళ్ళే విషయాన్ని గ్రహించాడు శ్రీధర్. శ్రీలక్ష్మి పుట్టింటి వాళ్ళు పేదవాళ్ళు. కాబట్టి ఆమె కాన్పుకు ప్రభుత్వ దవాఖానలోనే చేర్పిస్తారని నిర్ధారించుకున్నాడు.

శ్రీలక్ష్మి ఊరు రాయపట్నం వెళ్ళి డాక్టరు దేవానందంను కలిశాడు శ్రీధర్

"నా భార్యకు మగ పిల్లాడు పుట్టాలని నా కోరిక ఒక వేళ ఆడపిల్ల పుట్టినా దాన్ని మగ పిల్లాడుగా మార్చాలి.. ఈ సహాయం చేయాలి మీరు" అంటూ పదివేల రూపాయల కట్ట తీసి డాక్టర్‌కు ఇచ్చాడు శ్రీధర్.

ఆ డబ్బు తీసుకుంటూనే "ఇదెలా సాధ్యమవుతుంది?..మా ఉద్యోగాలు ఉండాలనుకున్నావా?..ఊడాలనుకున్నావా?" అన్నాడు డాక్టర్.

"అదేమీ కాదు డాక్టర్. మీ గురించి అంతా తెలుసుకునే వచ్చాను. కాన్పు సమయాలలో మగ పిల్లలు పుట్టిన వాళ్ళకు ఆడపిల్లల్ని, ఆడ పిల్లలు పుట్టిన వాళ్ళకు మగపిల్లల్ని మారుస్తారట కదా! ఇలా ఒక తల్లి బిడ్డను మరో తల్లికి ఇస్తున్నట్లుగా తెలిసే మీ దగ్గరకు వచ్చాను, ఎలాగయినా సరే నాకు మగపిల్లాడు కావాలి" అంటూ దీనంగా ప్రాధేయపడ్డాడు శ్రీధర్.

(మిగతా వచ్చే సంచికలో)

ఓ స్వాప్నికుడి 'చెదిరిన స్వప్నాలు'



చెదిరిన స్వప్నాలు
రచన : అంపశయ్య నవీన్,
ప్రత్యూష ప్రచురణలు, వరంగల్
వెల : రు.160, **పేజీలు :** 426
సోల్‌డిస్ట్రిబ్యూటర్స్ : నవోదయ బుక్‌హౌస్,
కాచిగూడ చౌరస్తా, హైదరాబాద్.

50 ఏళ్ళ తెలంగాణా జీవితంలోని మార్పులను ఆర్థిక, సామాజిక, రాజకీయ అంశాల ప్రాతిపదికన విశ్లేషించే ప్రయత్నంలో వెలువడిన రెండో పుస్తకమే 'చెదిరిన స్వప్నాలు'.

ఈ 50ఏళ్ళ తెలంగాణా జీవితానికి రాజు ప్రత్యక్ష సాక్షిగా, ప్రధాన పాత్రగా ఈ మూడు నవలలు కొనసాగుతాయి. ఈ నవలాత్రయంలో మొదటిదైన 'కాలరేఖలు' నవలలో రాజు బాల్యాన్ని ఆసరాగా చేసుకొని పదకొండవ ఆంధ్రమహాసభ నుండి ఆంధ్రప్రదేశ్ అవతరణ వరకు (1944-56) జరిగిన పరిణామాల్ని చిత్రీకరించారు. రెండవదైన ఈ 'చెదిరిన స్వప్నాలు' నవల 1957 నుండి 1970 వరకు గల కాలాన్ని రాజు కౌమార, యవ్వన దశలను చిత్రీకరించింది.

చిన్నప్పటి నుండి చదువులో చురుకైన వాడు రాజు. పెద్ద చదువులు చదివి ఉద్యోగంలో స్థిరపడాలని అతని కోరిక. రాజు హెచ్.ఎస్.సి. పాసైనా పై చదువులు చదవడానికి తండ్రి ఒప్పుకోకపోవడం, తప్పనిసరిగా ఒక ఏడాది పాటు తమ వ్యవసాయపు పనులు చేయాల్సి రావడం, ఆ కాయకష్టం తన ఒంటికి, మనస్తత్వానికి సరిపడదని గుర్తిస్తాడు. విచ్ఛిన్నమైన ఉమ్మడి కుటుంబం తాలూకు తమ వంతుకు వచ్చిన వ్యవసాయ భూమిని సాగు చేయడంలో రాజు తండ్రికి అప్పులు పెరుగుతాయి. దాయాదుల కొట్లాటల్లో భూమిని పడావుపెట్టి ఉంచడంతో, ఇల్లు గడవక అప్పులు చేయాల్సి వస్తుంది. తను చదివిన చదువుతో ఏదో ఒక ఉద్యోగం చేసి తనకు ఆసరాగా ఉండమనే తండ్రి వేధింపులతో కమ్యూనిటీ డెవలప్‌మెంట్ ప్రోగ్రాం కింద విలేజ్ లెవెల్ వర్కర్‌గా రాజు అప్లయ్ చేస్తాడు. అయితే అక్కడ వాళ్ళు ఇచ్చే కఠోర శిక్షణ, పద్ధతులకు తట్టుకోలేక రాజు తిరిగి ఇంటికి వస్తాడు. అనవసర భేషజాలకు ఎంతైనా ఖర్చు పెట్టే తండ్రి చదువుకోవడానికి మాత్రం డబ్బు ఇవ్వనని చెప్పినా, చివరకు తల్లి సహాయంతో రాజు కాలేజీలో చేరుతాడు. కాలేజీ ప్రవేశంతో రాజు జీవితం ఒక కొత్త మలుపు తిరుగుతుంది. అక్కడ పరిచయమైన కొత్త స్నేహితులు, లెక్చరర్ల బోధన, విద్యార్థి రాజకీయాలు వాటికి తోడుగా సాహిత్య పరిచయాలు అతడిలోని భావుకుడ్ని నిద్దురలేపుతాయి. రాజు కథకుడిగా మారడంతో పాటు మంచి విమర్శనాత్మక దృష్టి అలవడుతుంది. పై చదువులు చదివిస్తానంటే దూరపు బంధువైన అరుంధతిని పెళ్ళి చేసుకుంటాడు. రాజు ఉస్మానియాలో ఎం.ఏ. ఎకనామిక్స్ పూర్తి చేసి నల్గొండలో లెక్చరర్‌గా చేరి కొత్తగా కాపురం పెడతారు. చాలీచాలని జీతంతో కుటుంబంతో పాటు, ఇంటి బాధ్యతలను నెత్తిమీద వేసుకోవడంతో తీవ్రమైన ఆర్థిక ఇబ్బందులను ఎదుర్కొంటారు. తనలో రగులుతున్న అశాంతిని కథకుడిగా వ్యక్తీకరించాలనే పట్టుదలతో రాసిన మొదటి నవల సాహితీ ప్రపంచంలో సంచలనం సృష్టిస్తుంది.

మొదటి నుంచి రాజులో ఏర్పడిన హేతువాద దృక్పథం వలన చంద్రుడిపై మనిషి కాలుమోపడాన్ని మనిషి విజయంగా అభివర్ణిస్తాడు. రాజు విపరీతంగా అభిమానించే రచయిత చలం అష్టగ్రహ కూటమి సందర్భంలో యోధుడిలా ప్రవర్తించడాన్ని రాజు ఖండిస్తాడు. ఇక్కడే వ్యక్తిత్వాన్ని గమనించాలి. ఎప్పటికప్పుడు తనకెదురైన ప్రతికూల పరిస్థితులను అధిగమించి తాను కోరుకున్న లక్ష్యాన్ని చేరుకుంటాడు. ఎంత దుర్భర దారిద్ర్యాన్ని అనుభవించినా తన వ్యక్తిత్వాన్ని తాకట్టు పెట్టలేదు. తన బలహీనతలను స్పష్టంగా గుర్తించడంతో పాటు ఎలాంటి ప్రలోభాలకు లోనుకాకుండా స్పష్టంగా తనకు తానే మార్గనిర్దేశం చేసుకుంటాడు.

మొత్తంమీద ఆనాటి ఆర్థిక, సామాజిక, రాజకీయ, సాంస్కృతిక విషయాలను తెలియచేసే ఈ 'చెదిరిన స్వప్నాలు' భ్రష్టుపట్టిన రాజకీయాలు, విలువల క్షీణత, మారని ఆర్థిక పరిస్థితులు - పాలకుల దోపిడీ విధానాలు ఇవన్నీ రాజును కలవరపెట్టి అతని ఊహలను భగ్నం చేస్తాయి.

- కె.పి.అశోక్ కుమార్

స్వీకారం

ఇందూ-చందూ
రచన : కె.సభా; **వెల :** రు.20;
ప్రచురణ : విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్;
ప్రతులకు : విశాలాంధ్ర బుక్ హౌస్ అన్ని బ్రాంచీలు



నల్లకుక్క
రచన : డా|| ఎం.హరికిషన్; **వెల :** రు.20;
ప్రచురణ : విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్;
ప్రతులకు : విశాలాంధ్ర బుక్ హౌస్ అన్ని బ్రాంచీలు



తెలుగు కథకులు కథన రీతులు
సంకలనం : సింగమనేని నారాయణ;
వెల:రు.100; ప్రచురణ:విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్;
ప్రతులకు : విశాలాంధ్ర బుక్ హౌస్ అన్ని బ్రాంచీలు

శేషు

దక్షిణ కాశిగా పేరుగాంచిన రామేశ్వరం ఒక చిన్న ద్వీప పట్టణం. ఇక్కడి రామనాథస్వామి ఆలయానికి గల ప్రశస్తి కారణంగా యాత్రీకులు, భక్తులు ఏడాది పొడవునా పెద్దఎత్తున తరలివస్తుంటారు. ఈ పట్టణం ప్రధాన భూభాగానికి విడిగా సముద్రంలో ఉన్నప్పటికీ రైలు, రోడ్డు వంతెనల ద్వారా నిరంతరం యాత్రీకుల రద్దీ ఉంటుంది. ఈ వంతెనల దిగువ నుండి నౌకలు కూడా వెళుతుంటాయి. ఇక్కడి ఆలయం దక్షిణ భారతదేశంలోని ప్రముఖ ఆలయాల్లో ఒకటిగా చెబుతారు. పురాతన ద్రావిడ శిల్పకళారీతులకు, బ్రహ్మాండమైన పనితనానికి నిదర్శనంగా రామేశ్వరంలోని ఆలయం నిలుస్తుంది.

దక్షిణ కాశి

రామేశ్వరం

తిరుచిరాపల్లి

దేశంలో క్రైస్తవం ప్రవేశించినప్పటి నుండీ చరిత్రలో నిలిచిన తిరుచిరాపల్లిలో అన్ని మతాల ప్రాచీన ఆలయాలు ఉన్నాయి. చోళుల కాలంలో నిర్మించిన గణేశుని భారీ ఆలయం అద్భుత శిల్పకళల నిలయం. అబ్బురం కలిగించే పెద్ద పెద్ద రాతి స్తంభాలతో ఈ ఆలయాన్ని నిర్మించారు. గణేశుని ఆలయానికి ఉత్తరంగా కావేరీ నది రెండుపాయల నడుమ గల ద్వీప పట్టణం శ్రీరంగంలోని రంగనాథస్వామి ఆలయం చాలా ప్రసిద్ధి చెందింది. దీనికి దగ్గరలోనే జంబుకేశ్వర ఆలయం, లూర్డు చర్చి, సెయింట్ జాన్స్ చర్చి, నతర్‌వాలా దర్గా ఉన్నాయి.



వేలంగన్ని చర్చి

ధనుష్కోడి

ధనుష్కోడి సముద్రతీరంలో ఉంది. 1964లో వచ్చిన పెనుతుపాన్‌కు గ్రామం మొత్తం తుడిచిపెట్టుకుపోయినా అక్కడి కోదండ రామస్వామి ఆలయం మాత్రమే నిలిచి ఉంది. అతి పురాతనమైన ఈ ఆలయం నిర్మాణవిశిష్టతే దాన్ని కాపాడింది. రామాయణంలో రావణుడి తమ్ముడైన విభీషణుడు ఈ ప్రదేశంలోనే రాముడికి లొంగిపోయినట్లు చెబుతారు. ఆ తర్వాతే కోదండ రామస్వామి ఆలయం వెలిసిందని అంటారు.

చిదంబరం

పాండిచ్చేరికి 60 కిలోమీటర్ల దూరంలో గల చిదంబరంలోని నటరాజ ఆలయ సముదాయం ఎంతో ప్రసిద్ధి గాంచింది. దీన్ని నాట్యం చేస్తున్న శివుడికి అంకితం ఇచ్చారు. ఆలయం శివుడి పేరుతోనే ఉన్నా ఎక్కడా శివలింగం ఉండదు. అదే చిదంబర రహస్యంగా అక్కడివారు చెబుతారు. మొత్తం ఆలయం అంతా ద్రావిడ శిల్పకళారీతులే కనిపిస్తాయి. 50 ఎకరాల విస్తీర్ణంలో నిర్మించిన ఈ ఆలయానికి నాలుగు వైపులా నాలుగు పెద్ద గోపురాలు ఉన్నాయి. ఉత్తర, దక్షిణ దిక్కుల్లో ఉన్న గోపురాల ఎత్తు 49 మీటర్లు. ఇందులో నటరాజ విగ్రహం ఉన్నందున ఏటా ఇక్కడ భరతనాట్య ఉత్సవాలు భారీఎత్తున నిర్వహిస్తారు.

వేలంగన్ని

ఆలయాల పట్టణం కుంబకోణానికి 95 కిలోమీటర్ల దూరంలో వేలంగన్ని పట్టణం ఉంది. ఇక్కడి చర్చి దేశంలోని క్రైస్తవులందరికీ ఎంతో పవిత్రమైంది. కన్య మేరీ పేరుమీద ఈ చర్చిని నిర్మించారు. వేలంగన్ని మాత ఆలయంగానే చర్చి దేశమంతా ప్రాచుర్యం పొందింది. దేశం నలుమూలల నుండి క్రైస్తవ భక్తులు దీన్ని దర్శిస్తారు. వాస్తుకళరీత్యా కూడా వేలంగన్ని చర్చి ఎంతో ప్రసిద్ధి చెందింది. ◆

రంగస్థలంమీదే ఇన్‌వాల్వ్‌మెంట్ ఎక్కువ

నాయుడు గోపి

"ఆరుగాలం కష్టించి పంటపొలాల్లో మేం పండిస్తుంది ఏంది... పుట్టెడు శోకాన్ని... అప్పులు, అవమానాలు..." అనే బరువైన డైలాగ్ ద్వారా సీనియర్ రంగస్థలనటుడు నాయుడు గోపిగారు తన అభినయంలో గ్లోబలైజేషన్ పడగనీడలో రైతుల దుస్థితిని ప్రేక్షకుల కళ్లముందుంచుతారు. రైతునీ, రైతుల జీవితాల్నీ వ్యవసాయాన్ని, గ్రామీణ జీవనతరంగాల విద్యుద్ఘోషను రంగస్థలంపై సజీవంగా చూపిస్తున్న అతికొద్ది సంస్థల్లో "గంగోత్రి" ప్రఖ్యాతి చెందినది. **1983** నుండి గుంటూరుజిల్లా పెదకాకానిలో ప్రారంభమైన ఈ సంస్థ స్థాపించి తానూ, తన సంస్థను రాష్ట్రమంతటా వెలుగులోకి తెచ్చారు. "వానప్రస్తం" నాటకంలో, "హింసధ్వని" నాటికలో అభినయానికి, దర్శకత్వానికి నంది అవార్డులందుకున్నారు. నాయుడుగోపీగారు అక్షరాలా కళాజీవి. హైదరాబాద్ రవీంద్రభారతిలో మేకప్ తుడుచుకుంటూ ప్రజాశక్తి ఫీచర్ డెస్క్ శంకర్‌కి ఇచ్చిన ఇంటర్వ్యూ:

? రంగస్థల నాటకాలలో ఎక్కువగా, టీవీ, సినిమా మీడియాలలో ఇటీవల మీరు అభినయాన్ని ప్రదర్శిస్తున్నారు. మీ అభివ్యక్తీకరణ, అభినివేశాన్ని ఎక్కడ బాగా ప్రదర్శించగల్గుతున్నారు?

☞ రంగస్థలంమీదే సిన్సియర్‌గా ఇన్‌వాల్వ్ కాగల్గుతాను. ఎందుకంటే రసాస్వాదన చేసే ప్రేక్షక మహాశయులు నా కళ్ళెదుట ఉంటారు. వారి ఎటెన్షన్‌కి నేనూ, నా అభినయం టార్గెట్ అయి వుంటాయి. సినిమా, టీవీ మీడియాలు కెమేరా లెన్స్‌లోంచి ఎప్పుడో నా అభినయం చూసే ప్రేక్షకుల స్పందనను ఊహించుకుంటూ కాస్త నటిస్తాను. కట్ అనిపించుకుంటాను. మళ్ళీ నటిస్తాను. మళ్ళీ కట్... మళ్ళీ నటన...ఇవే జరుగుతాయి. అక్కడకంటే రంగస్థలంమీద స్క్రిప్టు, డైలాగ్, సన్నివేశం, భావంలోకి ఇన్‌వాల్వ్‌మెంట్ చాలా సిన్సియర్‌గా వుండాలి.

? ఏ మీడియా ప్రజలకు జవాబుదారీగా, బాధ్యత వహిస్తోంది?

☞ నాటకరంగమే నిజమైన జవాబుదారుగా వుంటోంది. బహుశా ఆ బాధ్యత వహించడంవల్లే నాటకరంగం ఇలాగైనా బతికి బట్టకడుతోంది. ఎందుకంటే సినిమా, టీవీలలోని కళారూపం రాసిన రచయిత, నటించిన నటులకీ... చూసే ప్రేక్షకులకూ మధ్య నిర్మాత, డిస్ట్రిబ్యూటర్, సినిమాహాలు, తెరపై మా నిర్జీవ ప్రతిరూపాలు అనే దూరం వుంటుంది. రంగస్థలంలో అలా కాదు. సినిమాలోలాగా ఏదిపడితే అది వేస్తే చూస్తూ ఊరుకోరు. ఆ సజీవ సంబంధం వల్లే నాటకం తన కథా వస్తువు, నటన, సందేశం ఇవ్వటంలో బాధ్యతాయుతంగా, జవాబుదారీతనంతో ఉంటోంది. ఉంటుంది.

కమురుభూమి

ఊరు నడుస్తున్నది
ఊతం లేని ముసలవ్వతీరు
ఊరు ఉలిక్కిపడుతున్నది
తల్లి కలలకచ్చిన అనాథ శిశువు తీరు.
ఊరి ఊపిరి గొట్టమిప్పుడు
ఉరికొయ్యలను ఏడిపిస్తున్నది.
పండని చేలు
నిండని చెర్లు
ఎండిన నోళ్ళని
ఊరేగిస్తూ
ఊరిప్పుడు అచ్చం
ప్రపంచ దరిద్ర పటం తీరున్నది.
ఎక్కడ చూసినా కాలుమోపరాని
కాలుతున్న కపాలాల కమురు వాసనే
ఎవర్ని చూసినా
మోకాళ్ళ నడకతో
మట్టిని మోసుకెళ్తున్న తట్టలే
బతుకు నియ్యరు
బతుకనియ్యరు
మెతుకును కొనగోటితో తాకనియ్యరు
పాత సందూకు చెప్పిన తాత ముచ్చట్లు

చిలుక్కొయ్య చూపిన చెక్క బొమ్మల ఆటలు
నడిజాము కుక్కల అరుపు
నడిమంత్రం బుగ్గపుటుక్కు
పొద్దుగాల్ల పిట్టల గోసకూతలు
పొద్దీకటి మేకల గావు గాథలు
ఊరంతా ఇప్పుడు
సగం కాలిన మనిషి తీరున్నది
సగం చెక్కిన పొచ్చవ్వ బొమ్మతీరున్నది.

- డా॥ ఉదారి నారాయణ

? సమకాలీనతను ప్రతిబింబించడంలో మీ గంగోత్రి కృషిని వివరించండి?

☞ ఇందాక చెప్పాకదండీ... చూసే ప్రేక్షకుడు, నటించే మేమూ ఎదురూబొదురూగా ఉంటాం. అందుకని ఎప్పటివో కథలు చెబితే ఊరుకోరు. వారు ఎదుర్కొంటున్న సమకాలీన సమస్యలను, అంశాలనూ ఎక్కువగా కోరుకుంటారు. మా గంగోత్రి సంస్థ సమకాలీన సామాజిక అంశాలనే ఎక్కువగా నాటకాలుగా వేసింది. వృద్ధాప్యం ఓ సమస్యగా తీవ్రంగా ముందుకొచ్చినప్పుడు "వానప్రస్తం" (నాటకం) వేశాం. చదువులు కొనుక్కొనే సరుకై కార్పొరేట్ వ్యాపారంగా విజృంభించిన రోజుల్లో అదితెచ్చిన వత్తిడికి నలిగిపోతున్న చిన్నారులను "హింసధ్వని" (1998) నాటికలో చూపించాం. షేర్లు, షేర్‌మార్కెట్ మాయాజాలంలో మధ్యతరగతి వాళ్ళ దయనీయ దోలాయమాన దుస్థితిని "శ్రీచక్రం"లో వ్యక్తం చేశాం. ప్రపంచీకరణ ఫలితంగా వచ్చిన టెర్మినేటర్ విత్తనం, నకిలీ విత్తనాలు, అప్పులు, రైతు ఆత్మహత్యలపై "భూమి పుత్రుడు" నాటికలో చాలా విస్తృతంగా ప్రదర్శించాం. విదేశీ వ్యామోహం, మానవ సంబంధాల విచ్ఛిన్నతపై "ఎడారి కోయిల" నాటిక వేశాం. మొత్తంమీద గ్రామీణ జీవితం బ్యాక్‌డ్రాప్‌గా, మధ్యతరగతి ప్రజల వ్యధల నేపథ్యంగా గంగోత్రి 13 నాటకాలూ, 21 నాటికలు స్వంత ప్రొడక్షన్‌గా ప్రదర్శించాం. వానప్రస్తం, హింసధ్వనిలకు నంది అవార్డులు, పరిషత్ బహుమతులు లభించాయి. గంగోత్రి కుటుంబ రచయిత వల్లూరి శివప్రసాద్‌గారు మాకు గొప్ప ఎస్సెట్.

? ఈ ఏడాది వచ్చిన నాటకాలపై, వాటి కథా వస్తువులపై మీ వ్యాఖ్యానం ఏమిటి?

☞ మొత్తంమీద 5, 6 మంచి నాటకాలు వచ్చాయండీ... "పెద్దలకు మాత్రమే", "ఆశల పల్లె...కి", "ఎక్కడ ఉన్నా... ఏమైనా" లాంటివి ఈ ఏడాది నందిలో కొత్త ప్రొడక్షన్స్‌గా వచ్చాయి. బాగున్నాయి. ఇంకొన్నింటిలో కథాంశం బాగుంది గానీ ప్రయోగంలో అంత వాసిగా లేవు.

? ప్రస్తుత ఎలక్ట్రానిక్ మీడియా మధ్య నాటకానికి ఉన్న పోషణ, ఆదరణ ఎలా వుంది?

☞ నంది, అనేక ప్రాంతాలలోని వివిధ పరిషత్‌లు నాటకానికి ఉన్నంతలో పోషణగా వున్నాయి. నంది నాటకోత్సవం ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం నిర్వహిస్తున్న ఈవెంట్‌గాబట్టి నంది నుంచి కళాకారులం ఎంతో ఆశిస్తాం. కానీ ఆశించినంతగా ఇటీవల లేదు. ముఖ్యంగా ప్రదర్శనా పారితోషికాలు మా కష్టానికి తగ్గ ప్రతిఫలంగా లేవు. స్క్రిప్టు తయారుజేసి, రిహార్సల్స్ చేసి, స్క్రూటినీ వరకు అయినంత ఖర్చుకూడా రాదు. పనులు మానుకొని ఇంతదూరం వచ్చి నాటకాన్ని ప్రదర్శిస్తే... దారి ఖర్చులు, ప్రదర్శన ఖర్చులు, నటుల ఖర్చులు అన్నీ మా జేబులోంచి వదిలించుకొని వెళ్తున్నాం. ఆ విధంగా నందికీ మేమే ఎదురుపెట్టుబడి పెడుతున్నాం. కొన్ని కొన్ని స్థానిక పరిషత్‌ల పాటి గౌరవం కూడా నంది నాటకోత్సవాల్లో దక్కడం లేదు. ఇప్పుడు మళ్ళీ బాధ్యతల్లోకి వచ్చిన రమణాచారిగారు ఈ దుస్థితిని మారుస్తారని ఆశిస్తున్నాం.

? నాటకం భవితవ్యం ఏమిటి?

☞ ఏమీ అర్థంకాని పరిస్థితి. క్రిందటేడాదున్న ట్రెండ్, ఆదరణ మరుసటేడుకి ఉండటం లేదు.

శకుని పాచిక



హంతకుడు
చేతులు కడిగేసి పోయాడు
అందరి చేతులకి నెత్తురంటింది
ఏ యుద్ధమూ లేకుండానే
వాడు గెలుస్తున్నాడనేదే
భయానక సూచిక
ఏ క్లోనింగ్‌లూ లేకుండానే
నన్ను 'వాడి'లా మలుస్తున్నాడనేదే
భవిష్యత్ తరాలకు
వాడు విసుర్తోన్న శకుని పాచిక
నట్టింట్లో కాబరేలని కాసినోలని
మొలకెత్తించిన మోన్‌శాంటో
విత్తనం వూరికే పోతుందా?
ఛానల్ మార్చినట్టు
మనసు మారిపోతోంది
షార్ట్ మిస్యూజ్ సర్వీస్‌ల సంతలో
మానవత్వపు మెసేజ్ గల్లంతైంది
నెట్ పోర్నోగ్రఫీ వెబ్‌సైట్ల వింతలో
ప్రేమకీ, కామానికీ మధ్య
దూరం చెరిగిపోయి
నీలిగోడలతో నిర్మించిన
గాలిమేడలే యవ్వనం
పునాదుల్ని కొల్లగొట్టే గంజాయివనం..
తరగతి గదుల్లో తలలు రాల్చేసే కొత్తతరం..
అప్పుడు
విధ్వంసోన్మాదాన్ని సాదరంగా
స్వాగతించిన 'స్వాహా' గాళ్ళంతా
స్వేచ్ఛామార్కెట్లో దిక్కుకొకరై
తప్పిపోయిన నా వాళ్ళంతా
ఇప్పుడు
మనోహర్ తల్వార్‌పై
వేలిముద్రలై దొరికారు

\- నవీన్

న్యాయసలహాలు

జి.ఎల్.నరసింహారావు, హైకోర్టు న్యాయవాది

ఖైదీకి బేడీలు వేయవచ్చా?

మా గ్రామంలో పార్టీ కక్షల వల్ల ఐదు సంవత్సరాల క్రితం జరిగిన హత్యకేసులో ఏ సంబంధం లేని మా అన్నగారికి కూడా యావజ్జీవిత శిక్షపడింది. గ్రామంలో గౌరవ ప్రదంగా బతుకుతున్న మా కుటుంబాన్ని కూడా ఒక పక్షం సానుభూతిపరులమని మా అన్నయ్యను ఇరికించారు. ఆ కేసులో అతను ఇప్పుడు సెంట్రల్ జైలులో ఉన్నాడు. ఆ కేసు మాత్రమే కాకుండా ఇంకో కేసులో కూడా అతను ముద్దాయి. మా ప్రత్యర్థులు అధికార పార్టీ వారు కావడంతో ఆ కేసులో మా అన్నయ్యను తీసుకువచ్చేటప్పుడు చేతులకు బేడీలు వేసి తీసుకొస్తున్నారు. కావాలనే మా అన్నయ్యను అలా తీసుకువస్తున్నారు. మా అన్నయ్యను అలా చూస్తే బాధగా వుంది. జడ్జిగారికి చెప్పాలా? ఏమి చేయాలోన్యాయ సలహా ఇవ్వగలరు.

- ఎం.బి., కర్నూలు

మీ అన్నయ్యగారి విషయంలోనే కాదు ఏ ముద్దాయిని గాని, నేరస్తుడిని గాని పోలీసులు బేడీలు వేసి తీసుకెళ్ల కూడదు. అలా బేడీలు వేయాల్సి వస్తే ముందుగా మేజిస్ట్రేట్ పర్మిషన్ తప్పక తీసుకోవాల్సి ఉంటుంది. ఎందుకోసం బేడీలు వేయాల్సి వచ్చిందో తెలుపుతూ పర్మిషన్ తీసుకోవాలి. కాని మన పోలీసు అధికారులు ఎవరూ పాటించడం లేదు. ఇవన్నీ పాటించాల్సిందిగా సుప్రీంకోర్టు 1993లోనే రూల్స్ ఫ్రేం చేసి హోమ్ సెక్రటరీస్‌కు పంపించింది. ఈ విషయంలో మీరు హైకోర్టులో రిట్‌వేసి బేడీలు వేయకుండా చేసుకోవచ్చు.

అగ్రిమెంట్ రాశారు రిజిస్ట్రేషన్ చేయడం లేదు

నేను నా భర్త ఇరువురం ఎంతో కష్టపడి పది సంవత్సరాలు సంపాదించిన సంపాదనతో ఇల్లు కొనాలనుకుని మధ్యవర్తిని కలిసి రు.3 లక్షలకు ఇల్లు మాట్లాడుకుని రు.80 వేలు అడ్వాన్సుగా ఇచ్చాం. మిగతా పైసలు నాలుగు నెలల్లో ఇచ్చి రిజిస్ట్రేషన్ చేయించుకుంటామని చెప్పాము. రు.80 వేలు తీసుకొని అగ్రిమెంట్ రాసి ఇచ్చారు. మిగతా డబ్బులు రెడీ చేసి రిజిస్ట్రేషన్‌కు రమ్మంటే రిజిస్ట్రేషన్‌కు రావడం లేదు. మా డబ్బులు మాకు ఇవ్వడం లేదు. మధ్యవర్తి కూడా ఏం చెప్పడు. పోలీసు కేసు పెట్టాలంటే వాళ్ళేమో రౌడీషీటర్స్ అని మా వారు భయపడుతున్నారు. ఏం చేయాలో సలహా ఇవ్వగలరు.

- పేరు రాయలేదు

ముందుగా ఇల్లు మీకు అగ్రిమెంట్ రాసిచ్చిన వారి పేరు మీద ఉందా? లేదా అని పరిశీలించాక అగ్రిమెంట్ చేసుకున్నారా? లేదా? ఏ కాగితాలు పరిశీలించారు. ఇల్లు అతడి పేరు మీదనే వుంటే ముందుగా నోటీసు ఇచ్చి 'స్పెసిఫిక్ పెర్‌ఫార్మెన్స్' దావా వేయాల్సి ఉంటుంది. ఇల్లు అతడి పేరు మీద లేకుంటే మీరు క్రిమినల్ కేసు పోలీసుల ద్వారా పెట్టవలసి ఉంటుంది. మీరు నేరుగా పోలీస్ కమీషనర్‌ని కలవండి. రౌడీషీటర్స్ అని భయపడవలసిన పని లేదు.

మీరు ఎదుర్కొనే న్యాయపరమైన సమస్యలకు అనుభవజ్ఞులైన న్యాయవాదులు సలహాలు ఇస్తారు. ఈ సమస్యలతో సతమతమయ్యే పాఠకులు తమ ప్రశ్నలను ప్రజాశక్తికి పంపిస్తే వీలువెంబడి న్యాయవాదుల సమాధానాలు ప్రచురిస్తాము.

చిరునామా :
న్యాయసలహాలు
ఆదివారం అనుబంధం,
ప్రజాశక్తి దినపత్రిక, స్ట్రీట్
నెం. 1, అశోక్‌నగర్,
హైదరాబాద్ - 20

రుచి

క్యాబేజీ చట్నీ

కావలసిన వస్తువులు:

క్యాబేజీ	:	ఒక కిలో
ఉప్పు	:	రెండు గిద్దలు
వెల్లుల్లి	:	50 గ్రాములు
కారం	:	రెండు గిద్దలు
మెంతి పిండి	:	50 గ్రాములు
నూనె	:	పావు కిలో
నిమ్మకాయలు	:	అర డజను
ఇంగువ	:	కొంచెం
కరివేపాకు	:	నాలుగు రెబ్బలు
జీలకర్ర	:	రెండు స్పూన్లు
ఎండుమిర్చి	:	ఐదు
ఆవాలు	:	రెండు స్పూన్లు

తయారుచేసే విధానం:

క్యాబేజీ బాగా సన్నగా తరిగి ఉంచుకోవాలి. ఇందులో ఉప్పు, కారం, మెంతిపిండి, వెల్లుల్లి వేసి కచ్చాపచ్చాగా దంచాలి. దీనిలో నిమ్మరసం కలపాలి. పొయ్యి మీద గిన్నెలో నూనె పోసి కాగనివ్వాలి. తాలింపులో ఎండుమిర్చి, జీలకర్ర, ఆవాలు, కరివేపాకు, ఇంగువ వేయాలి. తాలింపు ఆరనిచ్చి చట్నీలో కలపాలి. ఆరిన తరువాత సీసాలో పెట్టుపోవాలి. ఇది కరకరలాడుతూ చాలా రుచిగా ఉంటుంది.

అన్ని పప్పులతో మిక్సింగ్ పొడి

కావలసిన వస్తువులు:

కందిపప్పు	:	ఒక కప్పు
పుట్నాలపప్పు	:	ఒక కప్పు
శనగపప్పు	:	ఒక కప్పు
మినపప్పు	:	ఒక కప్పు
పెసరపప్పు	:	ఒక కప్పు
వేరుశనగపప్పు	:	ఒక కప్పు
ఎండు మిరపకాయలు	:	వంద గ్రాములు
ఉప్పు	:	తగినంత
వెల్లుల్లి	:	ఆరు రెబ్బలు
కరివేపాకు	:	10 రెబ్బలు
జీలకర్ర	:	50 గ్రాములు

తయారుచేసే విధానం:

పప్పులన్నీ రాళ్ళు లేకుంగా శుభ్రం చేసుకోవాలి. స్టౌ మీద బాణలి పెట్టి ఈ పప్పులన్నింటినీ వేరువేరుగా వేయించుకోవాలి. మిరపకాయలు తొడిమలు తీసి వేయించాలి. జీలకర్ర వేయించాలి. పప్పులు, జీలకర్ర, వెల్లుల్లి, కరివేపాకు, ఉప్పు వేసి మిక్సీలో పొడి కొట్టుకోవాలి. ఇది ఇడ్లీ, గారె, దోసె, బోండాలలోకి బాగుంటుంది. వేడి వేడి అన్నంలో నెయ్యి వేసుకొని తింటే చాలా రుచిగా ఉంటుంది. (పుట్నాలపప్పు (వేయించిన శనగపప్పు) వేయించనవసరం లేదు.)



విద్యార్థి, ఉద్యోగార్థుల సమాచార మార్గదర్శి

- పాఠశాల విద్యార్థులకు 'ప్రిపరేషన్' పాఠాలు
- విద్యార్థులకు కొత్త కోర్సుల అడ్మిషన్‌లు
- ఉద్యోగార్థులకు 'ఎంప్లాయ్‌మెంట్ ఆపార్చునిటీస్'
- 'కంప్యూటర్ ఛానెల్'లో ఐ.టి. న్యూస్
- విద్యావేత్త ఐఐటి రామయ్యగారి 'కౌన్సిలింగ్'
- 'వ్యక్తిత్వవికాసం'/మ్యాథ్స్ స్కిల్స్...... ఇలా అందరికీ అవసరమైన సమాచారమందించే ఏకైక విద్యా ఉద్యోగ వారపత్రిక
- అమూల్యమైన ఈసమాచారం అతి స్వల్పధరకే

దీపిక చందా వివరాలు :

సంవత్సర చందా : ఏజెంటు ద్వారా రూ. 150లు, పోస్టుద్వారా రూ. 160 లు
అర్ధసంవత్సర చందా : ఏజెంటు ద్వారా రూ. 80లు, పోస్టుద్వారా రూ. 85 లు

మీ అడ్రసు తెలుపుతూ చందాలను ఎం.ఓ/డి.డి. రూపంలో పంపించగలరు.

మా అడ్రసు : 1-1-298/4, స్ట్రీట్‌నెం. 1, అశోక్‌నగర్, హైదరాబాద్-20, ఫోన్ : 7665420, 7663761, మేనేజర్ : 7673787, ఫ్యాక్స్ : 763921, **website : www.prajasakti.com, e-mail : prajasakti@hotmail.com**

చందాదారులుగా చేరండి సమాచారం మీముంగిట నిలుస్తుంది